



అకాల వర్షానికి గుంటూరు మిర్చి యార్డులో తడిసిన మిర్చి

సీతారాముల కల్యాణం చూతము రారండి..

నవమి వేడుకలకు ముస్తాబైన పందిళ్లు, ఆలయాలు



తెనాలి మార్కెట్ సెంటర్‌లోని విద్యుత్ వెలుగుల్లో దొంగరాముని ఆలయం



విద్యుత్ వెలుగుల్లో గుంటూరు కొరిటెపాడులోని ఆంజనేయ స్వామి ఆలయం

శ్రీరామనవమి పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా అంతటా కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. రామాలయాలు, ఆంజనేయ స్వామి దేవాలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. పల్లెలు, పట్టణాల్లో రాములోరి వేడు కల కోసం ప్రత్యేకంగా పందిళ్లు వేశారు. సీతారా ముల కల్యాణానికి భక్తులు తలం బ్రాలను సిద్ధం చేశా రు. జిల్లా కేంద్రా లైన నరసరావు పేట, బాపట్లతో పాటు గుంటూరు, తెనాలిలో నవమి వేడుకలకు భారీగా ఏర్పాట్లు జరిగాయి. - గుంటూరు, తెనాలి



కొల్లిపర వద్ద గాలులకు నేలకొరిగిన అరటి తోట

అకాల వర్షం.. నష్టం

- మధ్యాహ్నం వరకు మండిన ఎండ
- సాయంత్రం ఈదురుగాలులతో వాన



మధ్యాహ్నం వరకు ఎండ మండింది. ఉన్నట్లుండి సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. గుంటూరు, తెనాలి, కొల్లూరు, వేమూరు, కొల్లిపర, పెదకూరపాడు తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. అకాల వర్షంతో కల్లాల్లోని పంట దిగుబడులను రక్షించుకునేందుకు పట్టలతో రైతులు పొలాల బాట పట్టారు. గుంటూరు మిర్చియార్డులో మిర్చి వర్షార్పణమైంది. - గుంటూరు, కొల్లిపర

ఎన్నికలు జరగక.. నిధులు రాక

- నిధులు లేక గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- ఎన్నికలు నిర్వహిస్తేనే ఆర్థిక సంఘం నిధులంటున్న కేంద్రం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సమీప పంచాయతీలకు నాలుగేళ్ల క్రితం ఎన్నికలు జరిగి.. ఆర్థిక సంఘం నిధులతో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. పాలకవర్గాల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతున్నాయి. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 69 పంచాయతీల్లో ఎన్నికలు జరగక ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. అయితే ఎన్నికలు జరగని ఫలితంగా ఆయా పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను ఆపేసింది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిం చింది. కేంద్రం విడుదల చేస్తున్న ఆర్థిక సంఘం నిధులే పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు. అయితే పాలకవర్గం లేదనే కారణంతో ఇప్పుడు ఈ నిధులనూ నిలిపేయడంతో వాటి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గత ఏడాది అక్టోబ రులో 15వ ఆర్థిక సంఘం నిధులను కేం ద్రం విడుదల చేసింది. జనవరిలో రెండో విడత నిధులను విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 69 పంచాయతీ లు రెండు విడతల్లో సుమారు రూ.7 కోట్లు నిధులను చేజార్చుకున్నాయి. పాలక వర్గాలు ఉంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధనను కేంద్రం విధించింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఎన్నికల పై ఎప్పటికి దృష్టి సారిస్తుందో.. వాటికి ఎప్పుడు నిధులు వస్తాయో చూడాలి.

విలీనాలు.. వివాదాలు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీల సమీపంలోని పలు పంచాయతీలను విలీనం చేశారు. నరసరావుపేట మున్సిపాల్టీలో ఇస్సపాలెం, లింగంగుంట్ల, యలమందల, రావిపాడు, కేసానుపల్లి పంచాయతీల

రూ.7 కోట్లు కోల్పోయిన 69 పంచాయతీలు

పరిధి లోకి కొంత ప్రాంతాన్ని విలీనం చేశారు. పొన్నూరు మున్సిపాల్టీలో చింతలపూడి, కసుకర్రు, కట్టెంపూడి, ఆలూరు, పెదఇటికంపాడు, వడ్డెముక్కల పంచా యతీలను విలీనం చేశారు. బాపట్ల మున్సిపాల్టీలో అడ వి,



నరసరావుపేట మండలం లింగంగుంట్లలో కనీస వసతులు లేని గిరిజన కాలనీ

అడవివారిపాలెం, ఈస్ట్ బాపట్ల, కొండబొట్ల వారి పాలెం, మరుప్రోలువారిపాలెం, ముత్తాయపాలెం, పిన్ని బోయినవారిపాలెం, పోతురాజుకొత్తపాలెం, తూర్పు పిన్న బోయినవారిపాలెం, వెస్ట్ బాపట్ల పంచాయతీలను విలీ నం చేశారు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో దండ మూడి విలీనం చేశారు. గుంటూరు కార్పొ రేషన్‌లో చినపలకలూరు, లాల్‌పురం, మంగళగిరి మున్సిపాల్టీలో ఆత్మకూరు, బేతపూడి, చినకాకాని, చిన వడ్లపూడి, కాజ, వెంకటరెడ్డిపాలెం, కురగల్లు, నీరుకొండ, నిడమర్రు, నూతక్కి, పెదవడ్లపూడి, రామచంద్రాపురం, యర్రబాలెం పంచా యతీలను విలీనం చేశారు. తాడేపల్లి మున్సిపాల్టీలో చిర్రావూరు, గుండిమెడ, ఇప్ప టం, కొలనుకొండ, మెల్లం పూడి, పెనుమాక, ప్రాతూరు, ఉండవల్లి, వడ్డేశ్వరం పంచాయతీలను విలీనం చేశారు. రాజధాని అమరావ తిలో అబ్బరాజుపాలెం, అనంతవరం, బోరుపాలెం, దొండపాడు, హరిశ్చంద్రాపురం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, మందడం, నెక్కల్లు, నేలపాడు, పెదపరిమి, రాయపూడి, శాఖమూరు పంచా యతీలను విలీనం చేశారు. ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదు. అధికా రం అండతో అధికారులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చి వారికి అనుకూలంగా మున్సి పాల్టీల్లో విలీనం చేశారు. విలీన ప్రక్రియపై అభ్యంతరాలు వచ్చినా అప్పట్లో అధికారులు లక్ష్య పెట్ట లేదు. ఫలితంగా పలువురు కోర్టులను ఆశ్రయించారు. దీంతో ఆయా పంచాయతీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం వివాదాలను పరిష్కరించకుండా వదిలేసింది. కూటమి ప్రభుత్వంలో అయినా కోర్టులోని వివాదాలు పరిష్కరించి ఎన్నికలు నిర్వహిస్తారని ఆశించిన వారికి పది నెలలుగా నిరాశే ఎదురైంది.

కృష్ణానదిపై.. మరో వంతెన

మాదిపాడు-ముక్త్యాల మధ్య నిర్మాణం

- నాబార్డు రూ60.54 కోట్లు మంజూరు
- క్షేత్రస్థాయిలో మొదలైన పనులు

అమరావతికి దేశంలోని అన్ని ప్రాంతాలతో సంబంధాలు ఉండేలా అద్భుతమైన రోడ్ నెట్‌వర్కును ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా కృష్ణానదిపై అరడజనుకు పైగా వంతెనలను నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అవి కాకుండా ఏడో వంతెనను కూడా అందుబాటులోకి తెస్తున్నారు. వంతెన పనులను ఇప్పటికే ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ముక్త్యాల-ఉమ్మడి గుంటూరు జిల్లా మాదిపాడు మధ్య కృష్ణానదిపై రూ.60.54 కోట్లతో మూడు వరుసల వంతెన నిర్మాణ పనులను తాజాగా ఆరంభించారు. నాబార్డు సాయంతో ఈ వంతెనను ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు.



మాదిపాడు-ముక్త్యాల మధ్య కృష్ణానదిపై వంతెనను నిర్మించనున్న ప్రాంతం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

దేశంలో ఏ రాజధానికి లేనట్లుగా రహదారుల కనెక్టివిటీ అమరావతి నగరానికే సొంతమవుతుంది. రాజధాని అమరావతికి చెన్నై, కలకత్తా, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల నుంచి కనెక్టివిటీ ఉండేలా అమరావతి చుట్టూ రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటివరకు కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజి, కనకదుర్గ వారధిల రూపంలో రెండు బ్రిడ్జిలు ఉండగా మరో అరడజను వంతెనలను నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. వీటిలో విజయవాడ పశ్చిమ బైపాస్ రూపంలో ఓ వంతెన మరికొద్ది రోజుల్లోనే ప్రజలకు అందుబాటులోకి రానుంది. మరో వంతెనను ఉమ్మడి గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడు-ఉమ్మడి కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యాల మధ్య నిర్మిస్తున్నారు. ఈ బ్రిడ్జితో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల నడుమ అమరావతి సమీప ప్రాంతంలో ఏడో బ్రిడ్జి ఏర్పాటవుతున్నట్లే.



నది మధ్య పిల్లర్లను పరిశీలిస్తున్న సిబ్బంది

రెండున్నర దశాబ్దాల కల

మాదిపాడు-ముక్త్యాల మధ్య కృష్ణానదిపై బ్రిడ్జిని నిర్మించాలన్నది ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల చిరకాల కోరిక. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దానిపై రోడ్డు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటు పల్నాడు, అటు ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వైపు సిమెంటు, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. మధ్యలో నది ఉండడంతో రెండు జిల్లాల నడుమ అటుఇటూ రవాణాకు 70కి.మీలు అదనమై పోతుంది. ప్రస్తుతం పలువురు బల్లకట్టు, ఇతరాత్ర పడవలపై ప్రమాదకరరీతిలో ప్రయాణిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కృష్ణానదిపై వంతెన నిర్మిస్తే రవాణా ఖర్చు తగ్గడంతో పాటు ప్రమాదాలను నివారించవచ్చు. పైగా గుంటూరు నుంచి హైదరాబాద్‌కు రాకపోకలను సాగించేవారికి 50 కిలోమీటర్ల వరకు దూరం తగ్గుతుంది.

నది వెడల్పు చాలా తక్కువ

కృష్ణానది రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా మాదిపాడు-ముక్త్యాల నడుమ కేవలం అర కిలోమీటరు వెడల్పుతో ప్రవహిస్తుంది. పైగా బ్రిడ్జి ప్రతిపాదిత స్థలంలో నది వంపు తిరుగుతున్నట్లు ఉండటంతో (మిగతా 8వ పేజీలో)

పల్లె పాలన.. ఆన్‌లైన్

- ఇక పంచాయతీల్లో అక్రమాలకు చెక్
- గ్రామాల్లో కార్యకలాపాలన్నీ డిజిటలైజేషన్
- కాగిత రహిత పాలనకు మూడు నెలల గడువు
- తొలివిడతలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు 95 కంప్యూటర్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)



పంచాయతీలను దోచేశారు. పాలనలో పారదర్శకతకు పాతరేశారు. పన్నుల వసూళ్లు.. నిధుల ఖర్చులకు లెక్కాపత్రాలు లేకుండా మింగేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కొన్ని పంచాయతీలు అక్రమాలకు కేంద్రాలుగా మార్చేశారు. పంచాయతీలను వేదికగా చేసుకుని వైసీపీ నేతాగణం అనేక అక్రమాలకు పాల్పడిన సంగతి తెలిసిందే. అటు నేతలు.. ఇటు అధికార యంత్రాంగం కలిసి పంచాయతీ లను నిర్వీర్యం చేశారు. ఈ పరిస్థితుల్లో అన్ని వ్యవస్థలను చక్క దిద్దే క్రమంలో కూటమి ప్రభుత్వం పంచాయతీల్లో అక్రమాలపై దృష్టి పెట్టింది. అయితే దేనికీ లెక్కాపత్రం లేకపోవడం, కొన్ని రికార్డులు మాయం చేయడాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఇలాంటి అక్రమాలకు విరుగుడుగా గ్రామ పాలనను పూర్తిగా ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా పల్లె పాలనా కార్యకలాపాలను డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా జరిగేలా ఆదేశాలు జారీ చేసింది. పన్నుల వసూలు మొదలుకుని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల జీతభ త్యాలు, నిధుల ఖర్చు, ఆర్థిక సంఘం నిధులు, గ్రామాభి వృద్ధికి దాతల విరాళాలు.. ఇలా అన్నింటినీ ఆన్‌లైన్ ద్వారానే చేయాలని తద్వారా పారదర్శకత తీసుకురావాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. గత ప్రభుత్వంలో ఇలాంటి ఒక వ్యవస్థ లేకపోవడం వల్లే పంచాయతీలను వైసీపీ నేతలు నిలువునా దోచేశారని, భవిష్యత్తులో గ్రామాల్లో ఖర్చు పెట్టే ప్రతి పైసాకు లెక్క ఉండటంతో పాటు గ్రామస్థులకు ఆన్‌లైన్‌లో అవి అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రికార్డుల డిజిటలైజేషన్ ద్వారా గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై స్పష్ట త వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే బాపట్ల జిల్లా వ్యాప్తంగా దాదాపు 55 పంచాయతీల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు నిర్ధారించి విచారణ చేస్తున్నారు. ఆన్‌లైన్ చేయడం ద్వారా అవినీతి నిగ్గు తేల్చడం కూడా సులభతరం అవుతుం దనేది ప్రభుత్వం ఉద్దేశంగా ఉంది.

పంచాయతీ పోర్టల్ ద్వారా..

పన్నుల వసూళ్లకు పంచాయతీల్లో స్వర్ణ పోర్టల్‌ను ఇప్పటికే ప్రవేశపెట్టిన ప్రభుత్వం దాని ద్వారానే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. క్యూ ఆర్ కోడ్ స్కానర్ల ద్వారా సిబ్బంది పన్నులు వసూలు చేస్తున్నారు. పంచాయతీల్లోని నిధుల నిల్వతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ల గణాంకాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంది. గ్రామాభివృద్ధికి ఖర్చు చేసే నిధులు, పనులు ఏ స్థాయిలో ఉన్నాయి ఇలా ప్రతి అంశాన్ని ఆన్‌లైన్ చేయాల్సిందే. ఉద్యోగుల చేతివాటానికి ఏ మాత్రం అవకాశం లేకుండా పం చాయతీలో జరిగే కార్య కలాపాలు ఆన్‌లైన్ గొడుగు కిందకు తేవడానికి ప్రభు త్వం చర్యలు చేపడుతోంది.

పంచాయతీల వారీగా నివేదికలు..

బాపట్ల జిల్లాలో మొత్తం 459 పంచాయతీలు ఉండగా ఉమ్మడి గుంటూరు జిల్లా వరకు చూస్తే 1012 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల్లో కాగిత రహిత పాలన శ్రీకారానికి మూడు నెలలు మాత్రమే ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఈ క్రమంలో ఏయే పంచాయతీల్లో కంప్యూటర్ల కొరత ఉందనే అంశంతో పాటు ఆన్‌లైన్ డేటాను పకడ్బందీగా నిర్వహించ డానికి నైపుణ్యం కలిగిన సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అనే సవివర నివేదికలను పంపాలని పంచాయతీ విభా గాన్ని ప్రభుత్వం ఆదేశించింది. క్షేత్ర స్థాయిల్లో పరిశీలన చేపట్టి ప్రాథమికంగా సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 450 పంచా యతీల్లో కంప్యూటర్ల కొరత ఉందని నివేదిక ఇచ్చారు. స్కిల్ సిబ్బంది అవసరం 300 వరకు ఉంటుందనే ప్రతిపాదనలను యంత్రాంగం పంపింది. ఈ పరిస్థితుల్లో తొలి విడతగా 95 కంప్యూటర్లను ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పంచాయతీలకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దశల వారీగా అన్ని పంచాయతీలకు కావాల్సిన సాంకేతిక సహాయంతో పాటు సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

వందకు చేరిన టీడీపీ శాశ్వత సభ్యత్వాలు

రాష్ట్రస్థాయిలో చిలకలూరిపేటకు మూడోస్థానం : ప్రత్తిపాటి

కాకుమాను సాగునీటి వ్యవస్థకు మహర్దశ

- రూ.10 కోట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చిన ప్రసాద్ సీడ్స్ అధినేత
- సీఎం పిలుపుతో పీ4లో భాగస్వామి అయ్యేందుకు నిర్ణయం

6

ఎన్‌ఐ పనుల కారణంగా రైళ్లపై ప్రభావం

అమరావతిలో ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు టెండర్లు ఖరారు

- చంద్రబాబు నివాసంలో 46వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం

8



కంకరగుంట ఆర్‌యూబీ వద్ద జరుగుతున్న పనులు

కంకరగుంట ఆర్‌యూబీ కష్టాలకు చెక్

- ఏటీ అగ్రహారం నుంచి యూటర్న్‌కి ప్రత్యామ్నాయం
- రూ.60 లక్షలతో పనులు చేపట్టేందుకు ప్రణాళిక

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణం ప్రారంభమైతే బ్రాడీపేట వైపునకు వచ్చే వాహనాలు కంకరగుంట ఆర్‌యూబీ నుంచి రావాల్సి వస్తోంది. కంకరగుంట ఆర్‌యూబీలోకి వెళ్లే వాహనాలు కలెక్టరేట్ రోడ్డులో నుంచి ఆర్వోబీ పక్కగా వెళ్లి యూటర్న్ తీసుకుని ప్రయాణిస్తున్నాయి. ఇక్కడ రోడ్డు ఇరుకుగా ఉండటం టర్నింగ్ తీసుకుని ఆర్‌యూబీలోకి వాహనాలు వెళ్లాల్సి వస్తోంది. ఈ సమయంలో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోతున్నాయి. ఏటీ అగ్రహారం జీరో లైను, ఒకటో లైను వైపు నుంచి వచ్చే వాహనాలతో కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. శంకర్‌విలాస్ ఆర్వోబీని కూల్చివేసిన తర్వాత వాహనాలు కంకరగుంట ఆర్‌యూబీ వద్ద స్తంభించిపోకుండా ఉండేందుకు ఎలాంటి యూటర్న్ లేకుండా నేరుగా ప్రయాణించేందుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఇందుకోసం పీకలవాగుపై వంతెన విస్తరణ, డివైడర్ మార్పు, విస్తరణకు అడ్డుగా ఉన్న భవనాల తొలగింపు, ఆర్‌యూబీలోకి ర్యాంపు నిర్మాణం తదితర పనులను రూ.60 లక్షలతో చే పట్టేందుకు అంచ నాలు రూపొందించింది. ఆయా పనులు ప్రారంభించేందుకు వీలుగా ఉన్న అడ్డంకులను నగరపాలకసంస్థ రెండు రోజులుగా తొలగిస్తున్నది. సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టి కలెక్టరేట్ వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా ఆర్‌యూబీలోకి ప్రవేశించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు నగరపాలకసంస్థ డీఈఈ మధుసూదనరావు తెలిపారు.

ఎన్ఐ పనుల కారణంగా రైళ్లపై ప్రభావం

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నంబూరు రైల్వేస్టేషన్‌లో నాన్ ఇంటర్ (ఎన్ఐ) లాకింగ్ పనుల కారణంగా నాలుగు రైళ్లపై ప్రభావం పడుతుందని రైల్వే సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 67229 విజయవాడ - గుంటూరు ప్యాసింజర్ రైలు ఈనెల 7, 8 తేదీల్లో రద్దు చేశామన్నారు. నంబరు. 67223 గుంటూరు - రేపల్లె ప్యాసింజర్ పైన పేర్కొన్న రెండు తేదీల్లో తెనాలి-రేపల్లె, రేపల్లె-తెనాలి మధ్యన మాత్రమే ప్రయాణిస్తుందన్నారు. గుంటూరు-తెనాలి మధ్యన ఈ రైలు సర్వీసు ఉండదని చెప్పారు. నంబరు. 12796 లింగంపల్లి - విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీన గుంటూరులో 50 నిమిషాల పాటు నిలిపేయడం జరుగుతుందన్నారు. అలానే నంబరు. 67228 మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ ఈ నెల 8వ తేదీన గంటపాటు గుంటూరులో నిలిపేస్తామన్నారు. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని సీనియర్ డీసీఎం విజ్ఞప్తి చేశారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

చిలకలూరిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుండయ్య తోటలో గేరా రాజేష్ (25) అనే యువకుడు తన గృహంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం మూడు రోజుల క్రితం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని రాజేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తున్నట్లుగా అర్బన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. దీంతో అర్బన్ సీఐ పీ రమేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. అయితే అప్పుల సమస్యతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

● ఏపీ రోడ్‌సేఫ్టీ డీఐజీ సీహెచ్ విజయారావు ● ఏఎన్‌యూలో ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఏపీ రోడ్ సేఫ్టీ డీఐజీ సీహెచ్ విజయారావు

పెదకాకాని, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, అనుకున్న లక్ష్య సాధనలో బాబూ జగ్జీవన్‌రామ్‌ను యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ రోడ్‌సేఫ్టీ విభాగ డీఐజీ సీహెచ్ విజయారావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయారావు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ చిననాటి నుంచే జగ్జీవన్‌రామ్ అంకితభావంతో నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని వాటిని పరిపూర్ణంగా సాధించారన్నారు. అతి సాధారణ స్థాయి నుంచి అసాధారణ స్థాయికి చేరుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమించారని తెలిపారు. పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందనే దానికి జగ్జీవన్‌రామ్ నిదర్శనమన్నారు. వీసీ ఆచార్య కే గంగాధరరావు ప్రసంగిస్తూ జగ్జీవన్‌రామ్ చేపట్టిన సంస్కరణల ఫలాలు నేటికీ మనం అనుభవిస్తున్నామన్నారు. కేంద్ర మంత్రిగా ఆయన మేథస్సు చూపడం వల్లనే అప్పుడు దేశం ఆహార కొరతను అధిగమించిందన్నారు. పాలన, రాజకీయ రంగాలలో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం మాట్లాడుతూ జగ్జీవన్ రామ్, పూలే, అంబేడ్కర్ వంటి మహనీయుల సేవలు, ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. అధ్యయనకేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్, అంబేడ్కర్, పూలే అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు ఆచా ర్య వై అశోక్ కుమార్, ఆచార్య ఎం త్రిమూర్తిరావు, యూనివర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య పీ బ్రహ్మాజీరావు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎం సుబ్బారావు, బాలుర వసతి గృహాల వార్డెన్ ఆచార్య మల్లిఖార్జున ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య కృష్ణారావు, వికాస అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ ప్రసాద్, జే శ్రీనివాసరావు, నాయకులు ఎన్ నాగేశ్వరరావు, ఎన్ వెంకటేశ్వర్లు, ఎస్సీ యూనియన్ అధ్యక్షులు కే కోటేశ్వరరావు, యూనివర్సిటీ ఇంజనీర్ డీ కుమార్ రాజు, ఎంఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కే ప్రపుల్ కుమార్, డీ నరేంద్ర, నాయకులు కోటయ్య, బీసీ సంఘ నాయకులు బీ కోటేశ్వరరావు యాదవ్, డీఈ కే సుబ్బారావు, విద్యార్థి సంఘ నాయకులు బద్రి, చంద్ర, నరసింహారావు, షాలేమ్, కోటయ్య, ఆనంద్, దుర్గా ప్రసాద్, రాము, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎడ్ల పోటీలు

● సీనియర్ విభాగం విజేతకు బుల్లెట్ బైక్ అందించిన ఆలపాటి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డులో జరుగుతున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలు శుక్రవారం అర్ధరాత్రి ముగిశాయి. ఆలపాటి వెంకట్రామయ్య స్మారక ఎడ్ల పోటీలలో చివరిగా సీనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో 11 జతల ఎడ్లు పాల్గొన్నాయి. నంద్యాలకు చెందిన కేశవరెడ్డి, హుజూర్‌నగర్‌కు చెందిన సురేంద్రరెడ్డి కంబైన్డ్ ఎడ్ల జత 3619 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం సాధించగా వారికి బుల్లెట్ బైక్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాధవి దంపతులు అందజేశారు. యూఎస్ఏకు చెందిన డాక్టర్ శ్యాంప్రసాద్, రాజేశ్వరి ఈ బహుమతి సమకూర్చారు. తాడేపల్లికి చెందిన నిక్షిత్‌రెడ్డి ఎడ్ల జత 3394 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, ప్రత్తిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత 3351 అడుగుల దూరం లాగి తృతీయస్థానం, హైదరాబాద్‌కు చెందిన ఆర్ఆర్ బుల్స్ రోహన్ బాబు ఎడ్ల జత 3190 అడుగుల దూరం లాగి నాలుగో స్థానం, ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్ల జత 3076 అడుగుల దూరంగా లాగి ఐదో స్థానం, ఎర్రగొండపాలెంకు చెందిన పెదచాంద్ ఎడ్ల జత 3006 అడుగుల దూరం లాగి ఆరోస్థానం, రెడ్డిపాలెంకు చెందిన దివాకర్ ఎడ్ల జత 2798 అడుగుల దూరం లాగి ఏడోస్థానం, వేటపాలెంకు చెందిన శివ కృష్ణ చౌదరి ఎడ్లజత 2716 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానం, సూర్యాపేట జిల్లా మఠంపల్లి శ్రీధర్‌రెడ్డి ఎడ్ల జత 2704 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానం సాధించాయి. విజేతలకు (ప్రథమ నుంచి తొమ్మిదో స్థానం వరకు వరుసగా) దాతలు మైనేని మురళీకృష్ణ రూ.లక్ష, అడుసుమల్లి రతీష్ రూ.80 వేలు, కొత్తమాసు కుమార్ రూ.70 వేలు, కొత్తపల్లి కృష్ణమోహన్ రూ.60 వేలు, కైతేపల్లి షాలేంరాజు రూ.50 వేలు, నన్నపనేని సుధాకర్ రూ.40 వేలు, గూడూరు శివనాగరాజు రూ.30 వేలు, ఈదర వెంకటపూర్ణచంద్ రూ.20 వేలు, గాజుల వెంకటసుబ్బయ్య రూ.15వేలు బహుమతిగా అందజేశారు.



సీనియర్ విభాగం విజేతకు బుల్లెట్ బైక్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, మాధవి దంపతులు

సిమెంట్ ఫ్యాక్టరీలకు 'కాసు' వత్తాసు

బాధిత గ్రామాల రైతుల ఆరోపణ

దాచేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ ఫ్యాక్టరీల నిర్మాణాలు జరుగుతున్నా...నోరు విప్పని కాసు మహేష్‌రెడ్డి నేడు ఆ యాజమాన్యాలకు అనుకూలంగా వకల్తా పుచ్చుకొని మాట్లాడటం ఎంత వరకు సమంజసమని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. శనివారం దాచేపల్లి నగర పంచాయతీ, నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో భవ్య, చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీల గ్రామాలకు చెందిన తక్కెళ్ళపాడు, పెదగార్లపాడు, తంగెడ గ్రామాలకు చెందిన రైతులు కూటమి నేతలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీల దుమ్ము, ధూళితో మిరప పంట నష్ట పోయినా... ..ప్రభుత్వ అనుమతులు లేకుండా..బ్లాస్టింగ్‌తో ఇంటి పునాదులు కదలిపోతున్నా ఏనాడు పెదవి విప్పని కాసు మహేష్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ప్రభుత్వ అనుమతులు లేకున్నా ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఇష్టానుసారం చేస్తుంటే ఆయా కంపెనీలు ఇచ్చిన నోట్ల కట్టలతో మౌనంగా ఉన్న నీవా? ఆరోపణలు చేసేది, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీల వలన భూములు కోల్పోయిన రైతులకు, దుమ్ము, ధూళి వల్ల పంట నష్ట పోయిన రైతులకు, ఇళ్ళు దెబ్బతిన్న బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెదగార్లపాడు గ్రామంలో బలహీన వర్గాల కాలనీలో ప్రభుత్వం పేద వారికి నిర్మించిన పక్కా గృహాలు, చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ మైనింగ్ ధాటికి పగుళ్ళు ఏర్పడి ప్రమాదకర స్థితిలో ఉంటే ప్రజలను పట్టించు కోకుండా చెట్టినాడు కంపెనీ వద్ద ముడుపులు తీసుకుని పబ్బం గడిపారని ఆరోపించారు. తక్కెళ్ళపాడు గ్రామస్తుల పొలాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా క్రషర్ల నిర్మాణం చేసినా పట్టించుకోలేదన్నారు. భవ్య సిమెంట్ ఫ్యాక్టరీని సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీకి అమ్మాలని బెదిరింపులకు పాల్పడి ఫ్యాక్టరీని రెండు వందల కోట్లకు స్కామ్ చేసింది మీరు కాదా? అంటూ విమర్శించారు. సమావేశంలో బెల్లంకొండ బద్రి, తంగెళ్ళ శ్రీనివాసరావు, నర్రా పుల్లయ్య, వేముల తిరుమల కుమార్, పాముల కిషోర్, అంబటి మల్లి, అక్కినపల్లి బాలయ్య, తిరుమల దుర్గారావు, కొప్పుల వెంకటేశ్వర్లు, నాయబ్ అబ్దుల్లా, షేక్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



దాచేపల్లి టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న తంగెడ, పెదగార్లపాడు, తక్కెళ్ళపాడు గ్రామస్తులు

షార్ట్ సర్క్యూట్‌కు ఒకరి మృతి

చిలకలూరిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో గంటన్నర సేపు భారీ వర్షం పడింది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లపై కొన్నిచోట్ల వర్షపు నీరు చేరింది. ఆ సమయంలో కేబీ రోడ్డులో గడియార స్తంభం ప్రాంతంలో ఒక దుకాణంలో ఆర్క్ వెల్డింగ్ చేస్తున్న స్థానిక సుగాలీ కాలనీకి చెందిన బాణావతు బీమా నాయక్ (55) అనే వ్యక్తి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

ఆక్విడెక్ నిర్మాణానికి రూ.10.75 కోట్లు

-మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్‌కాలంలోని 1916వ సంవత్సరంలో భట్టిప్రోలు సమీపంలోని డ్రెయిన్‌పై నిర్మించిన బ్రిడ్జి(సర్‌ప్లస్‌కేప్) ఇటీవల వర్షాలతో శిథిలమైపోవటంతో దాని నిర్మాణం కోసం రూ. 10.75 కోట్ల నిధులు మంజూరు చేయించామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నగరం, నిజాంపట్నం,చెరుకుపల్లి మండలాలతో పాటు వేమూరి నియోజకవర్గంలోని భట్టిప్రోలు పంటపొలాలైన 29,430ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ ఆక్విడెక్ నిర్మాణం వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తిచేస్తామని, రెండురోజుల్లో పనులు ప్రారంభం అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రాభివృద్ధికోసమే కృషిచెయ్యటం జరుగుతుందన్నారు.

శ్రీరామనవమి శుభాకాంక్షలు

సత్యం,ధర్మం,న్యాయం అనే శ్రీరాముని ఆశయాలు అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని మంత్రి అనగాని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామనవమి మీగృహాల్లో అందరికీ సుఖసంతోషాలను ఆరోగ్యాన్ని అందించాలని శ్రీరామచంద్రమూర్తి దయ అందరి కుటుంబాలపై ఉండాలని ఆకాంక్షించారు.

అప్పుల బాధతో కౌలు రైతు మృతి

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కారంపూడిపాడు ఎస్సీ కాలనీకి చెందిన కౌలు రైతు అన్నవరపు వసంతరావు(63) అప్పుల బాధతో పురుగు మందు తాగి మృతి చెందినట్టు కుమారుడు రవి వట్టిచెరుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వసంతరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వసంతరావు గత కొంత కాలంగా ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తూ సరైన దిగుబడి రాక చేసిన అప్పులు తీర్చే మార్గం కన్పించక కొద్ది రోజులుగా మనస్తాపానికి గురై తన తండ్రి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు రవి ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. జీజీహెచ్‌లో వసంతరావు మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు శనివారం సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పాండురంగ పేటకు చెందిన వేజండ్ల సుబ్బారావు తన ద్విచక్రవాహనంపై చెంచుపేట ఫ్లై ఓవర్ మీదగా మార్కెట్ సెంటర్ వైపు వెళ్లే క్రమంలో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయమైన సుబ్బారావును స్థానికులు జిల్లాప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పోలీసులను సంప్రదించగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

వందకు చేరిన టీడీపీ శాశ్వత సభ్యత్వాలు

రాష్ట్రస్థాయిలో చిలకలూరిపేటకు మూడోస్థానం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ శాశ్వత సభ్యత్వాలు 100కు చేరాయని, రాష్ట్రస్థాయిలో మంగళగిరి, ఆత్మకూరు తర్వాత చిలకలూరిపేట మూడో స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ



వంద శాశ్వత సభ్యత్వాలు పూర్తయిన సందర్భంగా నాయకులతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

శాశ్వత సభ్యత్వాలు చేర్పించే బాధ్యతను పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరీముల్లాకు అప్పగించడంతో అతను సమర్థవంతంగా పనిచేశారని తెలిపారు. చిలకలూరిపేట మండలానికి చెందిన గొట్టిపాటి బాబు, తాళ్లూరి సాంబశివరావులు శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఒక్కో సభ్యత్వానికి రూ. లక్ష చొప్పున 100కు పైగా శాశ్వత సభ్యత్వాలు నమోదు కావడం, తద్వారా పార్టీకి కోటి రూపాయలు సభ్యత్వ రుసుము వసూలు కావడం పార్టీకి, చిలకలూరిపేటకు గర్వకారణం అని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. కార్యక్రమంలో జవ్వాజి మదన్ మోహన్, నెల్లూరి సదాశివరావు, కందిమళ్ల రఘురామారావు పాల్గొన్నారు.

కాకుమాను సాగునీటి వ్యవస్థకు మహర్దశ

● రూ.10 కోట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చిన ప్రసాద్ సీడ్స్ అధినేత
● సీఎం పిలుపుతో పీ4లో భాగస్వామి అయ్యేందుకు నిర్ణయం

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన సీఎం చంద్ర బాబు ప్రారంభించిన పీ-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) కార్యక్రమానికి జిల్లాలో తొలి స్పందన లభించింది. కార్పొరేట్ దిగ్గజాల్లో ఒకరైన ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాదు కాకుమాను మండలంలో ఐదు వేల ఎకరాలకు పైగా భూమిని సాగునీటితో స్థిరీకరించేందుకు ముందు కొచ్చారు. ఇందుకోసం తన వంతు సాయంగా రూ.10 కోట్లను ప్రకటించారు. దీని వల్ల వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులకు మేలు జరుగు తుంది. ప్రసాదు చొరవ చూపించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయన్ని అభినందించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కాకుమాను మండలం నాగార్జునసా గర్ కాలువ ఆయకట్టుకు చివరి భూములు. అలానే మండలంలో మొత్తం 33 వేల ఎక రాల సాగుభూమి ఉండగా కొమ్మమూరు కాలువ కింద 18 వేల ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో 2,500 ఎకరాలు మాత్రమే మెట్ట భూమి. మిగతా భూమి అంతటికి సాగునీటి సదుపాయం ఉంది. నాగార్జునసాగర్ కాలువ కింద కొమ్మూరు, కొండపాటూరు గ్రామాల పరిధిలో సాగునీటికి కొంత సమస్య ఉత్పన్నమౌతున్నది. కొమ్మమూరు కాలువ కింద చివరి 10 కిలోమీటర్ల పరిధిలో భూములకు సాగునీరు సరిగా అందడం లేదు. ఇందుకో సం కొమ్మమూరు కాలువపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాల్సి ఉన్నది. దీని వల్ల కాకు మాను, బీకే పాలెం, అప్పాపురం, గరికపాడు, కొంపాటూరు గ్రామాల్లో 5315 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ నేపథ్యంలో పీ4లో భాగస్వామి అయ్యేందుకు కారుమంచి ప్రసాదు ముందుకొచ్చారు. శనివారం సీఎం చంద్రబాబుని ఆయన క్యాంపు కార్యాలయం లో కలిసి రూ.10 కోట్లను ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు.



క్యాంపు ఆఫీసులో సీఎం చంద్రబాబుతో ప్రసాద్ సీడ్స్ అధినేత

● కాకుమానుకు చెందిన కారుమంచి ప్రసాదు 1982లో ప్రసాద్ సీడ్స్ సంస్థని స్థాపించి అంచెలంచెలుగా దేశంలోని వివిధ ప్రాంతాలకే కాకుండా ఫిలిప్పీన్స్, ఇండోనే షియా వంటి దేశాలకు కూడా వ్యాపారాన్ని విస్తరించారు. మొక్కజొన్న, వరి, చిరుధాన్యాలు, పొద్దు తిరుగుడు, పత్తి, జూట్ వంటి విత్తనాలను ఉత్పత్తి చేస్తూ రైతులకు సరఫరా చేస్తున్నారు. త్వరలో కాకుమాను మండలంలోనే డ్రోన్స్ ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీని కూడా నెలకొల్పబోతున్నారు. వ్యవసాయ రంగంలో నేడు డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా రైతుల అవసరాలకు తగ్గట్టుగా ఈ డ్రోన్స్ ఉత్పత్తి చేయబోతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 138, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

గుంటూరు సిటీ వార్తలు

● గుంటూరు తూర్పు ● పశ్చిమ



ఆర్‌యూబీపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతినకుండా శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ముందుగానే ఆర్‌యూబీ నిర్మించేందుకు ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆటో కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం బ్రాడీపేట సీఐటీయూ కార్యాలయంలో ఆటో కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీఐటీయూ గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి అధ్యక్షత వహించారు. సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు కె.నళినీకాంత్ మాట్లాడుతూ 90 శాతం ట్రాఫిక్ అవసరాలు తీర్చే శంకర్ విలాస్ బ్రిడ్జి రాకపోకలు నిలిపివేస్తే పరిస్థితి ఎంత అయోమయంగా ఉంటుందో అధికారులు ఆలోచించాలని కోరారు. దీనికి ఖచ్చితమైన పరిష్కారం ముందుగా ఆర్‌యూబీ నిర్మించటమేనని తెలిపారు. సమావేశంలో జి.శంకరరావు, ఎం.రవి, ఎం.మురళి, కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, గండికోట శంకరరావు, కె.ఏడుకొండలు, రాంబాబు, బాలయ్య పాల్గొన్నారు.

చెత్త సేకరణ నూరు శాతం జరగాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా ప్రజారోగ్య విభాగం క్షేత్ర స్థాయిలో పిన్ పాయింట్ ప్రోగ్రాం సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం కమిషనర్ కెవిపి కాలనీ, ఆర్ అగ్రహారం, శారదా కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ మధుసూదన్, ఎస్ఎస్ ఐజాక్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. అన్న క్యాంటీన్లలో అందిస్తున్న ఆహార పదార్థాలపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తెలియచేయవచ్చని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆర్టీవో ఆఫీస్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

అలరించిన శ్రీరామ గానామృతం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై భక్త నారద గాన సభ ఆధ్వర్యంలో వసంత నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శనివారం జరిగిన శ్రీరామ గానామృతం ప్రేక్షకులను అలరింప చేసింది. తొలుత విశ్రాంత అదనపు ఎస్.పి. కాళహస్తి సత్యనారాయణ, సంగీత విద్వాంసులు కే.వీ బ్రహ్మానందం, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య తదితరులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య తమ గాత్రధారణలో నామ రామాయణం, సీతా కల్యాణ వైభోగమే అంటూ పలు భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. కళాకారులను ఘనంగా సత్కరించారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

గుంటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రజక మహిళను దూషించి, దాడి చేసిన నిందితులను చట్టపరంగా శిక్షించి కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ దోబీ మహా సంఘం అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. జేకేసీ కళాశాల రోడ్డులోని విజయపురిసౌత్‌లో ఓ అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మెన్‌గా ఉన్న రజక కుటుంబంపై కొందరు గొడవకు దిగి దూషిస్తూ సీతమ్మ అనే మహిళపై దాడి చేయటంపై నేషనల్ దోబీ మహా సంఘం నాయకులు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని బాధితులిని పరామర్శించారు. కార్యక్రమంలో ఏపీ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, దుర్గారావు, లక్ష్మయ్య, రామారావు తదితరులున్నారు.

సమైఖ్యత శంఖారావం మహాసభను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలోని సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో ఈనెల 13న జరిగే సమైక్యత శంఖారావ మహాసభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బ్రాడీపేట, గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రంలో సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మోని ఆధ్వర్యంలో నిర్వహించి విలేకరుల సమావేశంలో గోడప్రతులను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. దేశంలో మతసామరస్యం వర్థిల్లాలి.. మతోన్మాదం నశించాలి అనే నినాదంతో ఈ సభ జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టీ, ఎస్ హనుమంత్ రెడ్డి, షేక్ బాజీ,హాజీ అబ్దుల్ కలాం, ఖాజావలి, ఎస్ కే భాష తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం జంక్షన్‌లో పైప్‌లైన్‌కు లీకు



పైప్ లైన్ లీక్ ద్వారా వృథాగా పోతున్న తాగునీరు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం జంక్షన్‌లో ప్రధాన పైపులైన్‌కు భారీ లీక్ పడింది. శనివారం ఏర్పడ్డ ఈ లీక్ వల్ల తాగునీరు వృథాగా పోతుంది. ఆ ప్రాంతమంతా జలమయంగా మారింది. జంక్షన్ నుంచి వెళ్లాలంటేనే వాహనాలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీఎంసీ అధికారులు స్పందించి తక్షణమే లీకును అరికట్టాలని ప్రజల కోరుతున్నారు.

ఆదర్శమూర్తి జగ్జీవన్‌రామ్

● ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ
● ఘనంగా జయంతి వేడుకలు



జగ్జీవన్‌రామ్ జయంతిని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవతేజ, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్, ఇన్‌చార్జ్ మేయర్ షేక్ సజీలా, ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం అనే సిద్ధాంతాన్ని బలంగా ప్రజల్లో తీసుకొని వెళ్ళిన మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని, ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ అన్నారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ భారత ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ దళిత జాతి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధనలో జగ్జీవన్‌రామ్ కృషి ఎంతో ఉందన్నారు. ఇన్‌చార్జ్ మేయర్ షేక్ సజీల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బడుగు, బలహీన వర్గాల కోసం 27 పథకాలు తీసుకువచ్చారని, దళిత వాడల్లో రోడ్లు, నీళ్ళు, మౌళిక వసతులు సమకూర్చారని తెలిపారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నేటి తరం గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఎదగాలని ఆకాంక్షించారు. సభలో పాల్గొన్న వివిధ దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న పురస్కారానికి సిఫార్సు చేయాలని, రాజధాని అమరావతిలో 125 అడుగుల విగ్రహాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దుర్గాబాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక మార్కెట్ సెంటర్లో ఆయన విగ్రహానికి ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద బాబు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, ఇన్‌చార్జ్ మేయర్ షేక్ సజీల, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్వో ఖాజావలీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దుర్గాబాయి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

● గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయులని ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి, అనంతరం విజ్ఞాన మందిరం దగ్గరలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంహెచ్ఓ డాక్టర్ అమృతం, మేనేజర్ బాలాజి బాషా, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● 35వ డివిజన్ పట్టాభిపురం మెయిన్ రోడ్డులో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ జోన్-5 ఇన్‌చార్జ్ కోవెలమూడి రవీంద్ర (నాని) నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈరంటీ వరప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు, శ్రీదేవి, సుజాత, డేనియల్, శ్రీకాంత్, డివిజన్ జనసేన అధ్యక్షుడు జెట్టి బాబు, బీసీ నాయకులు బత్తుల జాన్ సైదా, సబ్బినేని శ్రీధర్ పాల్గొన్నారు.

● టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేల్, పార్టీ నాయకులు హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, షేక్ మీరావలి, దాసరి రమణ, యరమాల విజయ్ కిరణ్, దాసరి జ్యోతి, లామ్ నవమి, ఇత్తడి పున్నారావు, ఘంటసాల సోమశేఖర్, షేక్ చిన్నబాజి, నాయుడు ఓంకార్, ముత్తినేని రాజేష్, లక్ష్మి జానకి, తిరువళ్ళూరి పద్మావతి, మన్నవ కోటేశ్వరరావు, పాటిబండ్ల బలరాం, బత్తుల శ్రీనివాస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

● బాబూ జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల ఆత్మబంధువు, ఆదర్శప్రాయులు అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. ఆయన కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, గుడిమెట్ల దయారత్నం, చిలక వెంకటేశ్వర్లు, శ్రీను నాయక్, భాస్కర్, బాబురావు, రవి, కోకా బాలాజీ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

● దేశంలో జాతిపిత మహాత్మాగాంధీ తర్వాత బాపూజీ అనే బిరుదు దక్కిన ఏకైక వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో దర్శనపు యాకోబు, దాసరి జ్యోతి, రమణ, లాంవర్థన్ రావు, నవమి, దగ్గు కిరణ్, జి.కోటేశ్వరరావు, సుధీర్, మార్క్, సాల్మన్ రాజు, చెవల మన్నయ్య, కొమ్మినేని కోటేశ్వరరావు, ముత్తినేని రాజేష్, పఠాన్ అస్మా, ఇమ్రాన్, బుదే, రఫీ, శివజ్యోతి, నంది సరస్వతి, ఉప్పుదల సాంబ, అబ్దుల్ రహీం, చంద్రగిరి బాబు, అప్పారావు యాదవ్, మానం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్ర అందరికీ ఆదర్శం అని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. జడ్పీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వి.జ్యోతి బసు, ఏఓ శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

● గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యాలయం రాజీవ్‌గాంధీ భవన్‌లో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి శనివారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, పలువురు కాంగ్రెస్ నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు గడ్డం పాల్ విజయ్‌కుమార్, అంబటి రత్తయ్య, బిళ్ళా సునీల్, జొన్నల వెంకటరెడ్డి, షైలా కిరణ్, నాగూర్‌బాబు, పలగాని రామకృష్ణ, ఇస్మాయిల్ తదితరులున్నారు.

● అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని దివంగత బాబూజగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం జరిగింది. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, బసవ గుప్తా, సింగరయ్య, జనార్ధనరావు, పీటర్ పాల్గొన్నాన్నారు.

● బీజేపీ ఎస్‌సీ మోర్చా ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక హిందూ కళాశాల సెంటర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దారా అంబేడ్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, నాయకులు బీమినేని చంద్రశేఖర్, వైవీ సుబ్బారావు, చరక కుమార్‌గౌడ్, దర్శనపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మేకల రవీంద్రబాబు తదితరులు

సెయింట్ లారెల్స్ స్కూల్‌లో...

గుంటూరు(విద్య), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జాతి నిర్మాణం కోసం జగ్జీవన్‌రామ్ చేసిన కృషి నేటి యువతకు ఆదర్శనీయమని సెయింట్ లారెల్స్ స్కూల్ కార్యదర్శి మేకల రవీంద్రబాబు అన్నారు. శనివారం ఆర్టీసీ కాలనీలోని పాఠశాలలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఆయనను యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సాయి శ్రీకర్, ప్రిన్సిపాల్ ఏ కళ్యాణి, ఉపాధ్యాయులు రత్నకుమారి, సంతోష కుమారి, అంజనాదేవి, ప్రత్యూష పార్వతి, ప్రమీల, సీతామహాలక్ష్మి, కరుణ జ్యోతి, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కన్నా స్కూల్‌లో...

స్థానిక రైలుపేటలోని కన్నా స్కూల్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ కన్నా మాస్టారు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కన్నా మాస్టారు తదితరులు

కాలేయ వైఫల్యానికి... ప్లాస్మా ఎక్స్ఛేంజ్ థెరపీ

● కిమ్స్ శిఖరలో అరుదైన వైద్యచికిత్స

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు సేవించి కాలేయ వైఫల్యంతో అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన యువతికి కిమ్స్ శిఖర ఆసుపత్రిలో అరుదైన ప్లాస్మా ఎక్స్ఛేంజ్ థెరపీ (ప్లెక్స్ థెరపీ)తో ప్రాణాలు నిలిపారు. వివరాల్లోకి వెళితే... గత వారం 23 ఏళ్ల యువతి వ్యక్తిగత కారణాలతో ఎలుకల మందు సేవించడంతో కాలేయ వైఫల్యం, జాండీస్‌తో తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. కుటుంబీకులు ఆమెను చికిత్స నిమిత్తం మంగళదాస్‌నగర్‌లోని కిమ్స్ శిఖర ఆసుపత్రిలో చేర్చారు. గ్యాస్ట్రోఎంటిరాలజిస్టులు డాక్టర్ వి.ప్రతాప్‌మౌళి, డాక్టర్ విష్ణు ప్రసాద్, డాక్టర్ ప్రసన్నకుమార్‌తో పాటు నెఫ్రాలజిస్ట్ డాక్టర్ డాక్టర్ శరత్‌చంద్ర ఆమెను తక్షణం ఐసీయూలో చేర్పించి చికిత్సలు ప్రారంభించారు. ఎలుకల మందులో ఉన్న విష పదార్థం వల్ల ఆమె కాలేయం దెబ్బతింది. ఇటువంటి పరిస్థితుల్లో కాలేయ మార్పిడి చికిత్సలు చేయాల్సి వస్తుంది. అయితే కిమ్స్ వైద్యులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్లెక్స్ థెరపీ (ప్లాస్మా ఎక్స్ఛేంజ్ థెరపీ) విని యోగించి రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు కాలేయం కోలుకునేందుకు మందులు వాడారు. దీంతో యువతి వారం రోజుల్లో కోలుకున్నారు. శనివారం ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జీ చేశారు. సకాలంలో ప్లెక్స్ థెరపీ వినియోగించడంతో పాటు వైద్యనిపుణుల నైపుణ్యం యువతి ప్రాణాలను కాపాడినట్లు కిమ్స్ శిఖర యాజమాన్యం తెలిపింది.



కోలుకున్న యువతితో కిమ్స్ శిఖర వైద్యనిపుణులు

ట్రేడ్ లైసెన్సుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలి

● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞాపన



సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న దామచర్ల తదితరులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ట్రేడ్ లైసెన్సుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆడిటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామచర్ల శ్రీనివాస్ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం దామచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంతో సంప్రదించి జీఎస్టీ పోర్టల్‌లో సమస్యలు లేకుండా చూడాలన్నారు. అమరావతి ప్రాంతంలో ఆడిటర్స్ ప్రధాన కార్యాలయానికి 600 చదరపు గజాల స్థలాన్ని ప్రభుత్వం నిర్ణయించిన దరకే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే స్థలాన్ని కేటాయించి, ఆడిటర్స్‌కి సమస్యలు లేకుండా కృషి చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ కోటేశ్వరరావు, సలహాదారు బీవీఆర్ కుమార్, సభ్యులు జొన్నలగడ్డ శివ, కె వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జీఎంసీ కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం

● డివైడర్ కోసం తవ్విన గుంతలోకి దూసుకెళ్లిన కారు



డివైడర్ నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడ్డ కారు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని జేకేసీ కాలేజి నుంచి ఆర్టీవో కార్యాలయం వెళ్ళే రహదారిలో రోడ్డు మధ్య డివైడర్ కోసం తవ్విన గుంతలోకి శుక్రవారం రాత్రి కారు దూసుకుపోయింది. స్థానికులు వచ్చి కారులో ఉన్న వారిని అతి కష్టం మీద బయటకు తీసారు. డివైడర్ కోసం తవ్విన గుంత వద్ద ఎటువంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయక పోవటంతో శుక్రవారం ఒక్క రోజునే మూడు ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నిందితులకు శిక్షలు పడేలా చర్యలు : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన సీఐ నరసింహారావు

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడిన రౌడీషీటర్లు, మాదక ద్రవ్యాల కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారు. కోర్టు కానిస్టేబుళ్ళతో శనివారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ పలు ఆదేశాలు జారీ చేశారు. న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల విచారణను వేగవంతం చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్ల జారీని వేగవంతం చేయాలన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచాలని, వారి జాడ తెలియని పక్షంలో వారికి ఉన్న షూరిటీలను కోర్టుకు హాజరు పరచి తద్వారా జరగాల్సిన ప్రక్రియ చేపట్టాలన్నారు. రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లోని నిందితులకు శిక్షలు పడేలా చేస్తే ఇంకొకరు అటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉంటా రన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ-2 నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వెంగళాయపాలెం రిజర్వాయర్ స్థలంలో ఆక్రమణలు

● 20 రోజులుగా గుడిసెలు వేసి ఆక్రమించేందుకు ప్రయత్నం
● ఆక్రమణలను తొలగించిన టౌన్ ప్లానింగ్ అధికారులు



వెంగళాయపాలెంలో ఆక్రమణలను తొలగిస్తున్న జీఎంసీ అధికారులు

గుంటూరు, కార్పోరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలో జరుగుతున్న ఆక్రమణలను నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. శనివారం కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ అధికారులు, నల్లపాడు పోలీసులు సంయుక్తంగా ఈ ఆక్రమణలను తొలగించారు. గుంటూరు నగర పాలక సంస్థకు చెందిన వెంగళాయపాలెం తాగునీరు చెరువు, దాన్ని ఆనుకొని రిజర్వాయర్ నిర్మాణాన్ని అప్పట్లో పూర్తి చేశారు. అయితే రిజర్వాయర్ నిర్మాణం కాగా కొంత స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలాన్ని గమనించిన సుమారు 20 మంది ప్రజలు గత 20 రోజులుగా గుడిసెలేస్తూ ఆక్రమణకు పాల్పడ్డారు. దీనిపై కమిషనర్ పులి శ్రీనివాసులకు ఫిర్యాదులు అందగా, తక్షణమే ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏసీపీ వెంకటేశ్వర్లు, టీపీఎస్ కేవీ సత్యనారాయణ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ విష్ణు, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, అక్రమ నిర్మూలన దళం సభ్యులంతా నల్లపాడు పోలీసుల సహకారంతో అక్కడికి చేరుకొని, ఆక్రమణలు తొలగించారు.

సీతారాముల కల్యాణం...చూతము రారండి

● శ్రీరామ నవమికి ముస్తాబైన రామాలయాలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని నగరంలోని రామాలయాలు, అంజనేయస్వామి అలయాల వద్ద సీతారామ కల్యాణం మహోత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ముస్తాబు చేశారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో పలు దేవాలయాల వద్ద పండుగ శోభ సంతరించుకున్నాయి, స్వామి కల్యాణానికి వీక్షించడానికి వచ్చే భక్తుల కోసం ఆలయాల వద్ద బారికేడ్లు, ఇతర ఏర్పాట్లును చేశారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, బ్రాడీపేట, అరండల్‌పేట, కొరిటెపాడు, రామనామక్షేత్రం, ఇతర ఆలయాల్లో కల్యాణానికి ఏర్పాట్లు చేశారు.

నేడు నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్ర

శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని ఆదివారం నగరంలో శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శ్రీరామ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కారంశెట్టి లోకేష్ తెలిపారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, యాత్రలో ప్రజలు, రామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



డీఎస్ నగర్‌లో శ్రీరామ నవమికి ముస్తాబైన రామాలయం



రామనామ క్షేత్రంలో కల్యాణానికి ముస్తాబైన శ్రీ సీతారాములు

వాస్తవిక అంశాలతో రూపొందించిన '23'

● దర్శకుడు రాచకొండ రాజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చుండూరు, చిలకలూరిపేట, జూబ్లీహిల్స్ బాంబు దాడి ఘటనల్లో బాధితులు, నిందితుల జీవితాల్లో ఎదురైన సమస్యల ఆధారంగా '23' సినిమా రూపొందించామని దర్శకుడు రాచకొండ రాజ్ తెలిపారు. స్థానిక నగరంపాలెం, ఫినిక్స్ మాల్‌లో హీరో, హీరోయిన్లు రాయపాటి తేజ, తన్మయితో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల చివరి వారంలో సినిమాను విడుదల చేస్తామని తెలిపారు. గుంటూరులో ఏర్పాటు చేసిన ప్రివ్యూకి మంచి ప్రశంసలు వచ్చాయని అన్నారు. హీరో రాయపాటి తేజ మాట్లాడుతూ తన స్వస్థలం గుంటూరు అని, మా తాత రాయపాటి సాంబశివరావు ఎంపీగా పని చేశారని గుర్తు చేశారు. 23 సినిమాను ప్రతి ఒక్కరు ఆదరించాలని కోరారు. హీరోయిన్ తన్మయి మాట్లాడుతూ తొలి సినిమాలో మంచి పాత్ర దొరికిందని సంతోషం వ్యక్తం చేశారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న దర్శకుడు రాచకొండ రాజ్, హీరో రాయపాటి తేజ, హీరోయిన్ తన్మయి

రొటేషన్ పద్ధతిలోనే చార్టులను ఏర్పాటు చేయాలి

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-1 డిపో పరిధిలో ఫిక్స్‌డ్ చార్టులను అమల్లోకి తీసుకొచ్చి ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిక్స్‌డ్ చార్టులను వ్యతిరేకిస్తూ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్‌లు ఎన్‌టీఆర్ బస్టాండ్ ఆవరణలో రెండో రోజు శనివారం నిరసన తెలిపారు. డిపో ఎన్‌ఎంయూ నాయకులు డి.శంకరరావు, రామకృష్ణ, చిన్నబ్బాయి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆర్.శ్రీనివాసరావు, ఎన్‌వీ కృష్ణారావు, షేక్ మీరావలి, రత్నాకర్‌లు డ్రైవర్‌లు, కండక్టర్‌లు, గ్యారేజ్ ఉద్యోగులతో మధ్యాహ్నం గేట్ మీటింగ్ నిర్వహించారు. రొటేషన్ చార్ట్ పద్ధతిని అమలు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.





కొల్లిపరలో మొక్కజొన్న కండెలు చుట్టూ వర్షపు నీరు చేరడంతో సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రైతులు



కొల్లిపర మండలం దావులూరులో మొక్కజొన్న కల్లాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపుతున్న రైతులు

అకాల వర్షం.. నష్టం

మధ్యాహ్నం వరకు మండిన ఎండ

సాయంత్రం ఈదురుగాలులతో వాన

కల్లాల్లో తడిచిన పంట దిగుబడులు

గుంటూరు, కొల్లూరు, వేమూరు, కొల్లిపర, తెనాలిఅర్బన్, పెదకూరపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, తెనాలి, కొల్లూరు, వేమూరు, కొల్లిపర, పెదకూరపాడు తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఉరు ములు, పిడుగులతో వర్షం కురిసింది. అకాల వర్షంతో కల్లాల్లోని పంట దిగుబడులను రక్షించుకునేందుకు పట్టలతో రైతులు పొలాల బాట పట్టారు. అకాల వర్షం రైతులను నష్టాల పాలు చేసింది. రబీ పంట చేతికొచ్చే తరుణంలో కురిసిన అకాల వర్షానికి జొన్న, మొక్కజొన్న పంట ఉత్పత్తులు దెబ్బతిన్నాయి. వానతో మొక్కజొన్న కండెలు, గింజలు బూజుపట్టి నాణ్యత కోల్పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ధాటికి కొన్ని చోట్ల మొక్కజొన్న, జొన్న పైర్లు నేలవాలాయి. గుంటూరు నగరం, తెనాలి పట్టణంలో మండు వేసవిలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయం అయ్యాయి. మురుగు కాల్వలు, వాన నీరు ఏకమై రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

● కొల్లూరు, కొల్లిపర మండలాల్లో గంట పాటు ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి పొలాల్లో విరిచి ఉన్న కండెలు, పట్టాలపై ఆరబోసిన మొక్కజొన్న గింజలు తడిసిపోయాయి. పచ్చి ఇటుకలు చాలావరకు తడిసిపోయాయి. వర్షం కారణంగా రూ.2 కోట్లు వరకు నష్టం వాటిల్లినట్లు పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. వేమూరు మండల పరిధి కోతకు వచ్చిన జొన్న పైర్లు పడిపోయాయి. రాశులపై ఉన్న కంకులను రక్షించుకునేందుకు రైతులు పట్టాలు కప్పుకున్నారు. కొల్లిపర మండల పరిధిలో కల్లాలో ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న, జొన్న దిగుబడులను ట్రాక్టర్ల ద్వారా రైతులు హడావుడి ఇళ్లకు తరలించారు. పట్టాలు కప్పిన పసుపు, మొక్కజొన్న, జొన్నలు కూడా తడిచిపోయాయి. గాలికి పలు చోట్ల అరటి చెట్లు నేలవాలాయి.

● పెదకూరపాడు ప్రాంతంలో కురిసిన అకాల వర్షానికి కల్లాల్లోని మిర్చి తడిచిపో యింది. వర్షంతో రైతులు మిర్చి కల్లాల వైపు పట్టలతో పరుగులు తీశారు. మిర్చి కోతలు కోసి ఎండబెట్టే సమయంలో వర్షానికి రంగు మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాయలను గ్రేడింగ్ చేస్తూ కల్లాల్లో ఉంచగా అది తడిచిపోయింది.



గుంటూరు మిర్చియార్డులో తడిసిన మిర్చి

వ్యవసాయ శాఖ సూచనలు

అకాల వర్షాలకు జొన్న ఓదెలు తడిసిన చోట రైతులు ఎండ రాగానే వాటిని తిరగదీయాలని వ్యవసాయశాఖాధికారులు రైతులకు సూచనలు చేశారు. పల్లపు ప్రాంతాల్లో ఓదేలపై నీరు నిలిస్తే వెంటనే బయటకు పెట్టి ఉప్పు స్ప్రే చేయాలని తెలిపారు.

యార్డులో తడిసిన మిర్చి టిక్కీలు

అకాలవర్షం మిర్చియార్డుకు మిరపకాయల టిక్కీలు తీసుకొచ్చిన రైతులకు అపార నష్టాన్ని కలిగించింది. శుక్రవారం యార్డుకు తీసుకొచ్చిన మిర్చి టిక్కీల అమ్మకాలు జరగగా మిగిలినవి వేలం కేంద్రాల వెలుపలే ఉన్నాయి. తేమ శాతం అధికంగా ఉన్న కాయలను దుకాణాల ఎదుట ఆరబోశారు. శనివారం యార్డుకు సెలవుదినం కావడంతో హమాలీలు ఎక్కువ సంఖ్యలో అందుబాటులో లేరు. ఉదయం నుంచి ఎండ మండుతూ ఎలాంటి వర్షసూచన లేదు. అయితే సాయంత్రం 4 గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై యార్డు పరిసరాల్లో భారీగా వర్షం కురిసింది. దాంతో చాలావరకు మిర్చి టిక్కీలు తడిసిపోయాయి. ఆరబోసిన మిర్చి కిందకు వర్షం నీరు చేరడంతో అవి పూర్తిగా నానిపోయాయి. దాదాపుగా 100 క్వింటాళ్ల వరకు మిర్చి తడిసిపోయి ఉంటుందని భావిస్తున్నారు. అసలే మిర్చికి ధర లేక దిగాలు చెందుతున్న రైతులపై అకాల వర్షం పిడుగుపాటులా మారి మరింత చిదిమేసింది.



గుంటూరు మిర్చియార్డులో మిర్చిపై పట్టలు కప్పుతున్న రైతులు

కృష్ణానదిపై మరో వంతెన

(5వ పేజీ తరువాయి)

ప్రవాహం తక్కువగా ఉంటుంది. అరకిలోమీటరు బ్రిడ్జికి అనుబంధంగా మాదిపాడు వైపు అరకిలోమీటరు, ముక్త్యాల వైపు రెండున్నర కిలోమీటర్ల వంతున అప్రోచ్ రోడ్డును నిర్మించాలి. ఇందుకు అవసరమైన భూములు కూడా అందుబాటులో ఉన్నాయి. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా నదిలో 14 పిల్లర్లను నిర్మించనున్నారు. అటూ ఇటూ ఫుట్‌పాత్‌లతోపాటు మూడు వరుసలతో వంతెనను రెండేళ్లలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బ్రిడ్జి నిర్మాణంతో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలతోపాటు తెలంగాణలోని సూర్యపేట, ఖమ్మం జిల్లాల ప్రజలకు ఎంతో వెసులుబాటు కలుగుతుంది. ఈ బ్రిడ్జి వైకుంఠపురం బ్యారేజి కమ్ బ్రిడ్జి కన్నా ముందే ప్రజలకు అందుబాటులోకి రానుంది.



ప్రమాద భరిత పడవ ప్రయాణాలకు చెల్లుచీటి

జాప్యం కారణంగా పెరిగిన వ్యయం

మాదిపాడు-ముక్త్యాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి తొలినాళ్లలో రూ.15 కోట్లు వ్యయం కాగలదని అంచనాలను రూపొందించారు. ఆ తర్వాత అది రూ.36.19 కోట్లుగా, ఆ తర్వాత రూ.39.69 కోట్లుకు పెరిగింది. ప్రస్తుతం అంచనా వ్యయాన్ని పెంచి రూ.60.54 కోట్లకు గతేడాది నవంబరులో ఆర్‌అండ్‌బీ టెండర్లను ఆహ్వానించింది. వల్లభనేని కనస్ట్రక్షన్స్ కాంట్రాక్టును దక్కించుకునేందుకు ముందుకొచ్చింది. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన బ్రిడ్జి కావడంతో నిధులను సమాకూర్చడానికి నాబార్డు ముందుకొచ్చింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ దిశగా చొరవ చూపి కాంట్రాక్టు సంస్థతో చర్చలు జరిపి వారిని ఒప్పించి మరీ బ్రిడ్జి కాంట్రాక్టును అప్పగించింది. దీంతో సదరు కాంట్రాక్టు సంస్థ తాజాగా బ్రిడ్జి నిర్మాణపనులను ఆరంభించింది.

బహిరంగ మద్యపాన నిషేధానికి పటిష్ట చర్యలు

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలలో మద్యపాన నిషేధానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నామని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. శనివారం గుంటూరు బ్రాడీపేటలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, అచ్చంపేట, నరసరావుపేట, బొల్లాపల్లి మండాల్లోని 28 గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు జరుపుతున్నారని..నవోదయం 2.0 కార్యక్రమం కింద ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి 11 గ్రామాలను నాటుసారా తయారీ గ్రామాలుగా తీర్చిదిద్దామన్నారు. గత ఏడాది అక్టోబరు నుంచి మార్చి 31వ తేదీ వరకు 1364 కేసులు నమోదు చేసి 916 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి 2098 లీటర్ల లిక్కర్, బీరు 99 లీటర్లు, 376 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీంతో పాటు 2.35 కేజీల గంజాయి, 8.5గ్రాముల కొకైన్, 14.35గ్రాములు ఎండీఎంఏ, 18 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. 667 బెల్టు షాపులపై దాడులు నిర్వహించి 669 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1489 లీటర్ల మద్యం, 40లీటర్ల బీరు, 4 వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా బహిరంగ మద్యం సేవిస్తున్న 132 మందిని అరెస్టు చేసి 127 కేసులు నమోదు చేశామని వివరించారు. 1002 మందిపై బైండోవర్ చేయడం జరిగిందన్నారు. కల్తీ కల్లు నిరోధానికి 117 శాంపిల్స్, బార్‌లో లిక్కర్ నాణ్యతను పరిశీలించేందుకు 158, మద్యం దుకాణాల్లో మద్యం నాణ్యతను పరిశీలించేందుకు 106 శాంపిల్స్‌ను సేకరించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఏఈఎస్ ఈడే మారయ్యబాబు, ఎక్సైజ్ వన్ టౌన్ సీఐ బీ లత పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో ప్రసంగిస్తున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, పక్కన ఏఈ ఎస్ మారయ్య బాబు

అమరావతిలో ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు టెండర్లు ఖరారు

విజయవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు టెండర్లు ఖరార య్యాయి. అసెంబ్లీ నిర్మాణ పనులను ఎల్‌అండ్‌టీ సంస్థ దక్కించుకుంది. హైకోర్టు నిర్మాణ పనులను ఎన్‌సీసీ దక్కించుకుంది. ఈ రెండు టెండర్లలో ఎల్ - 1 గా నిలిచిన ఎల్‌అండ్‌టీ, ఎన్‌సీసీ సంస్థలకు ఎల్‌ఓఏ ఇచ్చేందుకు సీఆర్‌డీఏ ప్రతిపాదనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. శనివారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ 46 వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా అమరావతి రాజధానిలో ఐకానిక్‌గా నిర్మించే అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు పిలిచిన టెండర్లలో ఎల్ - 1 నిలిచిన సంస్థలకు ఎల్‌ఓఏలను ఇచ్చే అంశంపై చర్చ జరిగింది. ఐకానిక్ అసెంబ్లీ విషయానికి వస్తే బేస్‌మెంట్‌తో పాటు జీ ప్లస్ 3 విధానంలో నిర్మించాల్సి ఉంటుంది. దీనికి వ్యూయింగ్ ప్లాట్‌ఫామ్‌లు, పనోరమిక్ వ్యూ వంటివి కూడా ఉంటాయి. మొత్తం 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తారు. దీని ఎత్తు 250 మీటర్లుగా ఉంటుంది. హైకోర్టు విషయానికి వస్తే బేస్‌మెంట్‌తో పాటు జీ ప్లస్ 7 విధానంలో నిర్మించాల్సి ఉంటుంది. దీని బిల్టప్ ఏరియా 20.32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. దీని ఎత్తు 55 మీటర్లుగా ఉంటుంది. ఈ రెండు ఐకానిక్ నిర్మాణాల కోసం పిలిచిన టెండర్లకు సంబంధించి ముఖ్యమంత్రి సమీక్షించారు. ఎల్ - 1 గా నిలిచిన సంస్థలకు ఎల్‌ఓఏలు ఇవ్వాల్సిందిగా సీఆర్‌డీఏ కమిషనర్‌కు ముఖ్యమంత్రి ఆదేశించారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం ఇంకా అవసరమైన నిధుల సమీకరణ అంశంపై కూడా అథారిటీ సమావేశంలో ప్రధానంగా చర్చనీయాంశంగా మారింది. వివిధ ఆర్థిక సంస్థల నుంచి నిధుల సమీకరించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతులు ఇస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది. చేపట్టాల్సిన మిగిలిన పనులకు కూడా ఎలాంటి నిధుల కొరత రాకుండా త్వరితగతిన ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు చేపట్టేందుకు వీలుగా సీఆర్‌డీఏ కమిషనర్‌కు అన్ని రకాల అనుమతులను కల్పిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది.

సీతారాముల కల్యాణం చూతము రారండి

తెనాలిలో నవమి వేడుకలకు చలువ పందిళ్లు సిద్ధం

బోసురోడ్డులో 94వ ఏటా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా అంతటా కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. నవమి వేడుకలకు ఆంధ్రా ప్యారిస్ తెనాలి ముస్తాబైంది. అపర భద్రాద్రిగా వినుతికెక్కిన పట్టణంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు అన్ని చోట్ల ఏర్పాట్లు గావించారు. మెయిన్ రోడ్డు మొత్తం గాడిబావి సెంటర్ నుంచి గాంధీ చౌక్ వరకు చలువ పందిళ్లతో తీర్చిదిద్దారు. ఈ రహదారి అనుబంధ రోడ్లు కూడా కల్యాణం కోసం పందిళ్లు వేసి అలంకరించారు. గాడిబావి సెంటర్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో కళ్యాణం కోసం ముస్తాబు చేశారు. 1919లో ఇక్కడ దీపపు సిమ్మె ఏర్పాటు చేసుకుని భక్తులు భజనలు చేసేవారు. బ్రిటీష్ ప్రభుత్వం దేవాలయ నిర్మాణానికి అంగీకరించకపోవడంతో గ్రామస్తులంతా కలిసికట్టుగా రాత్రి పూట చిన్న ఆలయం నిర్మించి తెల్లవారే లోగా ప్రతిష్ట కూడా పూర్తి చేశారు. దీంతో దొంగరాముని గుడిగా ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. భద్రాచలంలో ఉన్న విధంగా ఇక్కడ శ్రీసీతారామ చంద్రులు ఒకేశిలపై ఉండటం విశేషం. క్రమేణా ఆలయాన్ని అభివృద్ధి చేసి మూడు గాలి గోపురాలతో జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన రామాలయంగా తీర్చిదిద్దారు. ఇక్కడ ప్రతిఏటా ఉగాది నుంచి నవమి వరకు ప్రత్యేక అలంకారాలు, గ్రామోత్సవాలు, కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో సంతానం లేని వారికి గరుడ ముద్దల ప్రసాదం అందిస్తారు. బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో ఉగాది నుండే చలువ పందిళ్లు వేసి సీతారాముల వారికి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ శాంతి కల్యాణం నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. 93 ఏళ్లుగా ఈ మందిరంలో ఉగాది నుంచి నవమి వరకు ఉత్సవాలు నిర్వహించి పెద్దఎత్తున అన్నదానం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా నిత్యపూజలు, శ్రీరామ కర్ణామృతంపై ప్రవచనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. పట్టణంలోని పలు రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేసి కమిటీల ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు గావించారు. పందిళ్లను రంగు రంగుల విద్యుద్దీపాలు, వస్త్రాలతో అలంకరించారు. ప్రతి ఏటా మెయిన్ రోడ్డులో పెద్ద సంఖ్యలో వ్యాపారస్తుల కుటుంబాలు సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. 43 ఏళ్లుగా హనుమాన్ చౌక్‌లో నిర్వహిస్తున్న కళ్యాణానికి శ్రీసీతారామ అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నారు. మందిర కమిటీ కార్యదర్శి కె.సూర్యనారాయణమూర్తి, విద్యాధర్, రవిశంకర్, ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. గాడిబావి సెంటర్‌లో ఈవో అమర్‌నాథ్, అర్చకులు గురునాథ ప్రసాదశాస్త్రి ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.



తెనాలి మెయిన్ రోడ్డులో వేసిన చలువ పందిళ్లు



ఆలయంలో జరుగుతున్న పూజలు

ప్రేక్షకులను ఆలోచింపచేసిన నాటికలు

రెండోరోజు కొనసాగిన పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం నాటకోత్సవాలు

యడ్లపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైన జాతీయ స్థాయి నాటిక పోటీలు రెండో రోజైన శనివారం కొనసాగాయి. పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రోజు పోటీలలో 4 నాటికలు ప్రదర్శితమయ్యాయి. రెండవ రోజు కార్యక్రమాల్లో భాగంగా ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి అతిథులు నిర్వాహకులు నివాళులర్పించారు. అనంతరం నాటిక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ప్రతి నాటిక విభిన్నమైన కోణంలో సందేశాత్మకంగా సాగాయి. ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకోవడంతోపాటు ఆలోచింప చేశాయి. ప్రతి నాటిక అనంతరం ప్రేక్షకుల నుంచి వచ్చిన కూపన్‌లను డ్రాతీసి పది మంది చొప్పున 30మంది విజేతలను ఎంపిక చేశారు అంతేగాకుండా ప్రతి ప్రదర్శనకు రూ.18వేలు పారితోషికాన్ని, జ్ఞాపికను అందజేశారు. అంతేగాకుండా మహిళా కళాకారిణులకు ఆడపడచు లాంఛనాలుగా బట్టలు, పసుపు, కుంకుమ అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కళానిలయం అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు గ్రామంలో ఎల్‌వీఆర్ కంటి ఆసుపత్రి సహకారంతో యడ్లపాడులో ఐ క్లినిక్ ఏర్పాటుచేసి ఉచితంగా వైద్యసేవలు అందించనున్నట్లు ప్రకటించారు. అందుకు అయ్యే ఖర్చు తానే భరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళానిలయం కార్యదర్శి ముత్తవరపు రామారావు, కవిరాజు సాహితీ సమితి అధ్యక్షులు ఆలోకం అబ్బయ్య, కళానిలయం ఉపాధ్యక్షులు జరుగుల శంకరం, తెలుగు నాటక పరిషత్‌ల సమ్మేళనం(వేదిక)లోని పరిషత్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.



జనరల్ బోగీలు నాటికలోని సన్నివేశం

కన్న కొడుకు ఆచూకీ తెలియక ఓతల్లి చెందే ఆవేదన, పోరాటమే 'జనరల్ బోగీలు'

రైలు ప్రమాదం జరిగినప్పుడు జనరల్ భోగీలలో ఉన్న ప్రయాణికుల గురించి ఎవరూ పట్టించుకోరు. మరణించినా వారి వివరాలు రైల్వేశాఖ వద్ద ఉండనందున వారి వివరాలు తెలియక బంధువులు పడే ఆవేదన, ఆందోళన వర్ణనాతీతం. ఒక రైలు ప్రమాద సమయంలో జనరల్ భోగీలో ప్రయాణిస్తున్న తన కుమారుడి ఆచూకీ తెలియక ఒక తల్లి అనుభవించే ఆవేదనను, పోరాటాన్ని తెలిపేది 'జనరల్ భోగీలు' నాటిక. కొడుకు ఆచూకీ కోసం ఓ తల్లి చేసిన అసమాన్య పోరాటాన్ని, వ్యవస్థలోని రుగ్మతలను ఎత్తి చూపుతూ ఎంతో సందేశాత్మకంగా సాగిన ఈ నాటికను సాయి ఆర్ట్స్ కొలకలూరు వారు ప్రదర్శించగా, పీటీ మాధవ్ రచన, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.

శృతిమించిన టెక్నాలజీనే 'నా శత్రువు'

నేడు మనిషి జీవితం టెక్నాలజీతో ముడిపడిపోయింది. సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్, సోషల్ మీడియాలో గంటల తరబడి గడుపుతున్నారు. బంధాలకు, అనుబంధాలకు దూరమై ఒంటరిగా మిగిలిపోతున్నారు. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వినియోగిస్తే దానికి మించిన మిత్రుడు మరొకరు ఉండరని, మించితే జీవితంలో ఊహించని ప్రమాదాలు సంభవిస్తాయని తెలియజేసే సందేశాత్మక నాటిక 'నా శత్రువు'. జయభేరి ఆర్ట్స్, హైదరాబాద్‌వారు సమర్పించిన ఈ నాటికను అక్కల తామేశ్వరయ్య రచించగా వడ్డాది సత్యన్నారాయణ దర్శకత్వం వహించారు.

కుటుంబ బంధాల్ని తెలియజెప్పిన 'ఋుతువులేని కాలం'

వర్తమానంలో ఆడపిల్లలు భర్త కావాలి, అతనికి తల్లిదండ్రులు, తోబుట్టువులు ఉండకూడదు. అలాంటి వ్యక్తి దొరికేవరకు పెళ్ళికూడా చేసుకోవడం లేదు. వీరి దృష్టిలో అత్త, ఆడబిడ్డలు శతృవులు, రాక్షసులు. తీసుకోవడమే తప్ప ఇచ్చే గుణం లేని వ్యక్తిత్వం. వస్తువులపై వ్యామోహం తప్ప జీవితంపైన, బంధాలపైన ప్రేమలేదు. విలాసాలు, ఫ్యాషన్లకు బానిసలై భర్త, పిల్లలకు దూరమై ఒంటరి జీవితాలను గడుపుతున్నారు. అలాంటి వారికి కుటుంబ బంధాలు, వాటి విలువల్ని తెలియచేసేదే 'ఋుతువులేని కాలం' నాటిక. కళానికేతన్, వీరన్నపాలెం వారు ప్రదర్శించిన ఈ నాటికను శ్రీఅగస్త్య రచించగా వైబి చౌదరి దర్శకత్వం వహించారు.

నైతిక విలువలులేని యువకుడికి గుణపాఠం నేర్పిన 'గురితప్పిన వేట'

నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి అడ్డదారులను ఆశ్రయించిన ఓ యువకుడు చేసే ప్రయత్నాన్ని ఎలా అడ్డుకుంది అన్న విషయాన్ని ఆసక్తికరమైన సంఘటనలతో ఆలోచన రేకెత్తించే విధంగా సందేశాత్మకంగా సాగిన నాటిక 'గురితప్పిన వేట'. రసఝురి, పొన్నూరు వారు ప్రదర్శించిన ఈ నాటికను పి మృత్యుంజయరావు రచించగా, వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు.



నా శత్రువు నాటికలోని సన్నివేశం

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

రూ.5కోట్లతో ఉండవల్లి-ఎర్రబాలెం రోడ్డు అభివృద్ధి

మంగళగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలోని పలు రహదారుల అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఉండవల్లి నుంచి ఎర్రబాలెం వరకు ఉన్న ఆర్అండ్బీ రహదారిని 6.4కిలో మీటర్ల తారు లేయర్ వేసేందుకు రూ.5 కోట్లను మంజూరు చేయించారు. ఈ మేరకు త్వరలో సంబంధిత పనులు ప్రారంభం కానున్నాయని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు.

పాస్టర్లకు నకిలీ ఎస్ఐ బెదిరింపులు

మంగళగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలు చర్చిలకు చెందిన పాస్టర్లను గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి తాను ఎస్ఐనని చెప్పుకుంటూ వారిని బెదిరిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం రేవేంద్రపాడులోని ఆర్సీఎం చర్చి పాస్టర్ వద్దకు గుంటూరుకు చెందిన కనపాల జోసఫ్ అనే వ్యక్తి వచ్చి తాను ఎస్ఐ నంటూ అతడిని పలురకాలుగా బెదిరించాడు. అతడి తీరుతో అనుమానపడిన సదరు పాస్టర్ దుగ్గిరాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వెంకటరవి రంగంలోకి దిగి విచారించగా సదరు నిందితుడు జోసఫ్ గుంటూరు నగరంలోని ఓ కళాశాలలో ఉద్యోగిగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని దుగ్గిరాల తహసీల్దారు సునీత వద్ద హాజరుపర్చగా ప్రాథమిక తప్పుగా హెచ్చరించి బైండోవర్ చేసినట్టు ఎస్ఐ వెంకటరవి శనివారం తెలిపారు.

శరణాలయంలో అన్నదానం

మంగళగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-1 ఆర్టీసీ డిపో మేనేజ్ మువ్వా రామకృష్ణ, తాడికొండ ఈవోపీఆర్డీ సాయిలీల దంపతుల కుమార్తె మౌన్విత పుట్టినరోజును పురస్కరించుకుని చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో బాలబాలికలకు శనివారం అన్నదానం చేశారు. శరణాలయం బాలలు దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత కంట్రోలర్ చుండి వెంకటరావు, షైన్ ఆశ్రమ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

సీమరాజాపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన కుటుంబసభ్యులపై అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధి సీమరాజాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ నేతలు శనివారం మంగళగిరి పట్టణ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని సీఐ వినోద్కుమార్కు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, నేతలు నారాయణమూర్తి, కాశినేడి బాజీగంగాధర్, ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, సయ్యద్ గౌస్ మొహిద్దీన్, భీమిరెడ్డి శరత్కుమార్రెడ్డి, కలకోటి సునిల్కుమార్, ఆర్ధల మనీష్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం సీసాలు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ఫిరంగిపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేరికపూడి గ్రామంలోని సెంటర్లో ద్రోణాదుల వెంకట సుబ్బా రెడ్డి అనే వ్యక్తి ఎలాంటి లైసెన్స్ లేకుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మద్యం సీసాలు అమ్ముతుండగా శనివారం ఫిరంగిపురం పోలీసులు అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 36 క్వార్టర్ విస్కీ బాటిళ్లను పట్టుకొని సీజ్ చేసి అరెస్టు చేసినట్టు ఫిరంగిపురం పోలీసులు తెలిపారు.

ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య



ఆరుమళ్ళ దాసు (ఫైల్ ఫొటో)

పెదనందిపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగానికి చెందిన ఆరుమళ్ళ దాసు(55) పురుగుమందు తాగి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు దాసు పెదనందిపాడు, నాగులపాడు, వరగాని గ్రామాల్లోని పంచాయతి పరిధిలో వీధి లైట్లు, మోటర్లను రిపేరు చేస్తూ ఉంటున్నాడు. ఉదయం ఇంటి నుంచి పెదనందిపాడుకు అని పంచాయతి వద్ద డంపింగ్ యార్డ బోర్డులు ఏర్పాటు చేసేందుకు వెళుతున్నానని చెప్పి వెళ్లారని కుటుంబ సభ్యులు ఫోన్ చెస్తే ఫోన్ లిఫ్ట్ చెయ్యకపోవడంతో అతను పనిచేసే పరిసర ప్రాంతాల్లో ఎక్కడ వెతికినా ఆచూకి లభ్యం కాకపోవడంతో పోలీస్స్టేషన్కి వచ్చి ఎస్ఐ మధుపవన్కి తెలుపగా ఫోన్ సిగ్నల్ ఆధారంగా వరగాని సమీపంలోని కొల్లా వారి చెరువు వద్ద ఉన్నట్లు పోలీసులు తెలుపగా కుటుంబసభ్యులు వెళ్లి చూడగా విగత జీవిగా పడిఉండడం చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి చూడగా దాసు మృతదేహం వద్ద మద్యం బాటిల్తోపాటు పురుగుమందు డబ్బాను గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృత దేహంపై రక్తపు మరకలు ఉన్నాయని ఎవరో చంపి పడవేశారని బంధువులు ఆరోపించారు.

చిన్నారులకు నోటుబుక్స్ పంపిణీ

మంగళగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన మండెపూడి పురుషోత్తం ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని చినకాకాని షైన్ అనాథ శరణాలయం చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మండెపూడి పానకాలరావు, పురుషోత్తం కుటుంబ సభ్యులు, శరణాలయం ప్రతినిధులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



ఎమ్మెస్సెస్ భవన్లో జగ్జీవన్రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు నేతలు పేర్కొన్నారు. జగ్జీవన్రామ్ జయంతిని పురస్కరించుకుని మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్లో నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బస్టాండు వద్ద గల జగ్జీవన్రామ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. టీడీపీ ఎస్సీ సెల్ గుంటూరు పార్లమెంటు అధ్యక్షుడు వేమూరి మైనర్బాబు మాట్లాడుతూ దళిత సమాజ అభివృద్ధికి కోసం జగ్జీవన్రామ్ ఎనలేని సేవలందించారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరిరావు, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యర్రగుంట్ల భాగ్యారావు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, నేతలు మల్లవరపు వెంకట్, ఊట్ల శ్రీమన్నారాయణ, కారంపూడి అంకమ్మరావు, వాకా మాదవరావు, షేక్ సుభానీ, దిడ్లా సత్యానందం, జొన్నాదుల బాలకృష్ణ, జంజనం వెంకట సుబ్బారావు, వెలగపాటి విలియం, గోసాల రాఘవ తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు లంకా శివరామ్ ప్రసాద్, కార్యదర్శి కురగంటి రమేష్ ఆధ్వర్యంలో జగ్జీవన్రామ్ జయంతి నిర్వహించారు. బార్ అసోసియేషన్ కోశాధికారి తోట నరసింహారావు, అడిషనల్ పీపీ ఆర్ రాజేష్, న్యాయవాదులు ఎస్బీ మురళీకృష్ణ, వెంకటస్వామి, ఎస్ బాలశౌరి, వేమూరి రత్న ప్రసాద్, ఎండీ షౌకత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఎంఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా మంగళగిరి బస్టాండు వద్ద గల జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కలకోటి నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి చందోలు విక్టర్పాల్, ఏసుపోగు శ్యామల, రాజేష్, కుమార్, అద్దెపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి ఏపీఎస్పీ ఆరో పటాలంలో కమాండెంట్ కే నగేష్బాబు, అడిషనల్ కమాండెంట్లు, జగ్జీవన్రామ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

తాడేపల్లిలో వాడవాడలా..

తాడేపల్లి/తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం, మండలంలోని వివిధ గ్రామాల్లో జగ్జీవన్రామ్ జయంతిని వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్రామ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం అవ్వాలని పిలుపునిచ్చారు. తాడేపల్లి తహసీల్దార్ వారి కార్యాలయం వద్ద తహసీల్దార్ డి సీతారామయ్య, సిబ్బంది జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డేశ్వరంలో సీనియర్ టీడీపీ నేత కాట్రగడ్డ మధు, ఈపూరి కోటయ్య, ఎమ్మార్పీఎస్ నేత నాగేశ్వరరావు ఉండవల్లిలో జగనసేన నేతలు, సామల నాగేశ్వరరావు, జొన్నా రాజేష్, చవ్వాకుల కోటేష్బాబు, రాజా రమేష్, టిడిపి నేత గాదె వినయ్, పట్టణ కార్యాలయంలో వల్లభనేని వెంకట్రావు, కుంచనపల్లిలో కానుగోలు కోటేశ్వరరావు, రమేష్, దాసెట్టి అరుణ, మేకల రాజా, తదితరుల ఆధ్వర్యంలో జగ్జీవన్రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ జగ్జీవన్రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు జగ్జీవన్రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సాయిబాబ గుడివద్ద జరిగిన జగ్జీవన్రామ్ జయంతి కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, ముదిగొండ ప్రకాష్, డేవిడ్రాజు, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి):** స్థానిక పోలీస్స్టేషన్ సమీపంలో జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిలువూరు దళితవాడలోని జగ్జీవన్రామ్ విగ్రహానికి ఎంపీపీ షేక్ జబీన్, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ రోజమరియమ్మ, తోటకూర సీతారామయ్య, శేషగిరి, సాదిక్, ఏసుపాదం తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల కార్యాలయంలో జగ్జీవన్రామ్ చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీలు వెనిగళ్ల శ్రీకృష్ణ ప్రసాద్, ఉన్నం ఝాన్సీరాణి, ఎస్సీసెల్ నాయకులు పినపాటి కరుణాకర్, జీవన్, దేవరపల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాల పోలీస్స్టేషన్ సమీపంలో జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

బడుగువర్గాల సంక్షేమానికి జగ్జీవన్‌రామ్ కృషి ఎనలేనిది



పొన్నెకల్లులో జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

తాడికొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దేశ ఉపప్రధానిగా బడుగువర్గాల సంక్షేమానికి పాటుపడిన బాబూ జగ్జీవన్రామ్ హరిత విప్లవానికి కూడా ఎంతో దోహదపడ్డారని పలువురు టీడీపీ నాయకులు తెలిపారు. బాబు జగ్జీవన్రామ్ జయంతిని మండలంలోని తాడికొండ, పొన్నెకల్లు, నిడుముక్కల తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు కృషి చేసిన జగజ్జీవన్రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, నీటిసంఘం అధ్యక్షుడు గుంటుపల్లి మధుసూదనరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిగురుపాటి అనూఫ్, బీసీ సాధికారిక మేదర సమితి రాష్ట్ర కన్వీనర్ దూళిపాళ్ల ఏసుబాబు, ఎడ్డూరి ప్రసన్నబాబు, ముక్కెర శ్రీను, ఆలపాటి బాలయ్య, నూతక్కి నవీన్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **తుళ్లూరు, (పెదపరిమి) (ఆంధ్రజ్యోతి):** పెదపరిమిలో జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాల వేసి నూతలపాటి టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఘన నివాళి అర్పించారు. పక్కనే ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నూతలపాటి మాట్లాడుతూ జగ్జీవన్రామ్ ఆశయాలను కొనసాగించాలన్నారు. మల్కాపురంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొర్రా నరసింహారావు, మాజీ ఎంపీటీసీ వేజళ్ల శివప్రసాదరావు, మాజీ సర్పంచ్ గోచిపాత కుటుంబరావు మహిళా నేత కూచిపూడి మరియమ్మ, తెలుగుయువత సభ్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.

పూలింగ్‌కు ఇవ్వని భూములకు అదనపు ప్యాకేజి ఇవ్వాలి

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో లాండ్ పూలింగ్కు ఇవ్వని భూములకు అదనపు ప్యాకేజి ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకర్ డిమాండ్ చేశారు. ఉండవల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం రాజధాని రైతుసంఘం కార్యకర్తల సమావేశం పి.వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించారు. జొన్నా శివశంకర్ మాట్లాడుతూ కొండవీటి వాగు వెడల్పు, సీడ్ యాక్సిస్ రోడ్డుకు సంబంధించి రైతులతో మాట్లాడి స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉండవల్లిలో యూ-1 జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో పసుపు జొన్న, మొక్కజొన్న, మిర్చి పంటలు తడిసి రంగు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ఏప్రిల్ 11న ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాల్లో పతాకావిష్కరణ చేయాలని స్థానిక రైతాంగ సమస్యలపై ఆందోళన కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వర్రెడ్డి, టి బక్కిరెడ్డి, గణేష్ నాగేశ్వరరావు, సాంబశివరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో డ్రగ్స్, గంజాయి పట్టివేత

● పోలీసుల అదుపులో నలుగురు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రవికుమార్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నిషేధిత మత్తు పదార్థాలు, గంజాయి విక్రయిస్తున్న నలుగురు నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏఎస్పీ రవికుమార్ వివరాలను వెల్లడించారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన నందం నిఖిల్, రాణీగారి తోటకు చెందిన బొట్ల వెంకట కాశీవర్ధన్, కృష్ణలంకకు చెందిన పెండ్యాల సాయికుమార్, తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన గొర్ల గిరీష్రెడ్డి ఒకరి ద్వారా ఒకరు పరిచయమై స్నేహితులుగా మారారు. గిరీష్రెడ్డి సామాజిక మాధ్యమాల ద్వారా కుక్కపిల్లలను అమ్మే వ్యాపారం చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో బెంగుళూరుకు చెందిన శామ్యూల్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. నలుగురు నిందితులు చెడు అలవాట్లకు బానిసలుగా మారి శామ్యూల్ ద్వారా ఎండీఎంఏ సింథటిక్ డ్రగ్స్ను కొనుగోలు చేస్తున్నారు. శామ్యూల్ విజయవాడ వచ్చి నిఖిల్కు ఎండీఎంఏ డ్రగ్స్ను గ్రాము రూ.5 వేల చొప్పున విక్రయిస్తుంటాడు. నిఖిల్, కాశీ వర్ధన్లు గ్రాము ఎండీఎంఏ డ్రగ్స్ను రూ.పది వేల చొప్పున యువతకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే, నలుగురు నిందితులు సోహైల్ అనే వ్యక్తి ద్వారా కిలో గంజాయి రూ.8 వేలకు కొనుగోలు చేసి, దానిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్ను రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తున్నారు. నిఖిల్ ఇటీవల శామ్యూల్ వద్ద నుంచి పది గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ను కొనుగోలు చేశాడు. దానిని నిఖిల్ కొంత తాగి మిగతాది మూడు ప్యాకెట్లుగా మార్చి తన స్నేహితులైన మిగతా ముగ్గురికి విక్రయించాడు. డ్రగ్స్కు బదులుగా 1200 గ్రాముల గంజాయి ఇవ్వాలని కోరాడు. అనంతరం డ్రగ్స్, గంజాయిని ఎర్రబాలెం గ్రామం వద్ద గల డిలైట్ ధాబా సమీపంలో విక్రయించేందుకు శుక్రవారం వచ్చారు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మొత్తం 1200 గ్రాముల గంజాయి, 8.71 గ్రాముల ఎండీఎంఏ సింథ టిక్ డ్రగ్స్, కేటీఎం బైకును స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.లక్షా పది వేలు వుంటుందన్నారు. ఈ కేసులో శామ్యూల్, సోహైల్ను అరెస్టు చేయవలసి వుందని తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వికాసంతో ఎదుగుదల

ఫిరంగిపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మానసిక వికాసంతో విద్యార్థులు ఎదుగుతారని ప్రముఖ సైకాలజిస్టు ప్రత్యూష సుబ్బారావు అన్నారు. శనివారం ఫిరంగిపురంలోని సెయింట్ జేవీఆర్ ఫార్మసీ కళాశాలలో జరిగిన మానసిక వికాసం సమావేశంలో ఆయన మాట్లాడారు. మానసిక వికాసానికి, వ్యక్తిత్వానికి, ఒత్తిడిని తట్టుకోవటానికి, భవిష్యత్తులో ఎదగటానికి కావాల్సిన సూచనలు, సలహాలను ఆయన విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దాని జీవన్ మణిబాబు, సెక్రటరీ డాక్టర్ మేరి, కార్స్ జాయింట్ డైరెక్టర్ కే పుష్పలత, బాలబాట డిప్యూటీ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు, ఆర్సీజేసీ ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలో ఆంజనేయస్వామి గుడి వద్ద ప్రమాదవశాత్తు శనివారం గడ్డివాము దగ్ధమైంది. మదసాని సుబ్బారావుకు చెందిన నాలుగు ఎకరాల గడ్డివాము పూర్తిగా దగ్ధం కాగా, సుమారు రూ.60వేల నష్టం వాటిల్లి ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

ఆటోనగర్‌లో చలివేంద్రం ప్రారంభం

మంగళగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మోటార్ టెక్నీషియన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళగిరి ఆటోనగర్లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని పట్టణ ఎస్ఐ రవీంద్ర నాయక్ ప్రారంభించి తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్లా ఖాన్, ఉపాధ్యక్షుడు అజీమ్, కార్యదర్శి పఠాన్ రియాజ్ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం

పెదనందిపాడు, ఏప్రిల్, 5 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని నూచాలమ్మ తిరునాళ్ళ మహోత్సవంలో భాగంగా శనివారం రెండవ రోజు అమ్మ వారికి విశేషపూజలు నిర్వహించారు.మహాలక్ష్మీ యాగం పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

వెంగళాయపాలెం రిజర్వాయర్ స్థలంలో ఆక్రమణలు

● 20 రోజులుగా గుడిసెలు వేసి ఆక్రమించేందుకు ప్రయత్నం
● ఆక్రమణలను తొలగించిన టౌన్ ప్లానింగ్ అధికారులు



వెంగళాయపాలెంలో ఆక్రమణలను తొలగిస్తున్న జీఎంసీ అధికారులు

గుంటూరు, కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలో జరుగుతున్న ఆక్రమణలను నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. శనివారం కార్పొరేషన్లోని టౌన్ ప్లానింగ్ అధికారులు, నల్లపాడు పోలీసులు సంయుక్తంగా ఈ ఆక్రమణలను తొలగించారు. గుంటూరు నగర పాలక సంస్థకు చెందిన వెంగళాయపాలెం తాగునీరు చెరువు, దాన్ని ఆనుకొని రిజర్వాయర్ నిర్మాణాన్ని అప్పట్లో పూర్తి చేశారు. అయితే రిజర్వాయర్ నిర్మాణం కాగా కొంత స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలాన్ని గమనించిన సుమారు 20 మంది ప్రజలు గత 20 రోజులుగా గుడిసెలేస్తూ ఆక్రమణకు పాల్పడ్డారు. దీనిపై కమిషనర్ పులి శ్రీనివాసులకు ఫిర్యాదులు అందగా, తక్షణమే ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏసీపీ వెంకటేశ్వర్లు, టీపీఎస్ కేవీ సత్యనారాయణ, బిల్డింగ్ ఇన్స్పెక్టర్ విష్ణు, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, అక్రమ నిర్మూలన దళం సభ్యులంతా నల్లపాడు పోలీసుల సహకారంతో అక్కడికి చేరుకొని, ఆక్రమణలు తొలగించారు.

మున్సిపల్ కార్మికులకు పని భద్రత కల్పించాలి



కార్మికులతో మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షుడు రవి

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆప్కాస్ను కొనసాగించి మున్సిపల్ కార్మికులకు పని భద్రత కల్పించాలని రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం రవి కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని ఎర్రబాలెంలో శనివారం పని విరామ సమయంలో జరిగిన మున్సిపల్ కార్మికుల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆప్కాస్ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా మున్సిపల్ కార్మికులకు టోపీలు, మజ్జిగ, రక్షణ పరికరాలు అందజేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులు అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు టీ ఆదిలక్ష్మీ, కే కోటేశ్వరి, ఎం పార్వతి, ఎస్.దివ్య, ఏడుకొండలు, అంకమ్మరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆప్కాస్‌లోనే ఉంచాలని ధర్నా

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను ఆప్కాస్లోనే కొనసాగించాలని మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ప్రతినిధులు శని వారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్కానే ముద్దు.. ప్రైవేటు ఏజెన్సీలు వద్దు... అంటూ పెద్ద ఎత్తు న నినాదాలు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా మున్సి పల్ కార్మికులకు అండగా ఉంటామని చెప్పిన టీడీపీ నేడు తన అనుయాయులకు మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీల పేరుతో అప్పగించడానికి పూను కుందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నేతలు వేముల దుర్గారావు విమర్శించారు. ప్రభుత్వ విధానాల్లో మార్పు రాకపోతే మే నెలలో సమ్మెకు వెళతామన్నారు. కార్యక్రమంలో బూరుగ వెంకటేశ్వరరావు, వనమా సతీష్, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పసుపు కల్లాలను పరిశీలించిన రైతు సంఘం నేతలు



తడిచిన పసుపు పంటను పరిశీలిస్తున్న జొన్నా శివశంకర్ తదితరులు

తాడేపల్లి (కుంచనపల్లి), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పసుపు క్వింటాల్ మద్దతు ధర రూ.15వేలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న పసుపు కల్లాలను రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి పసుపు రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. తాడేపల్లి, దుగ్గిరాల, కొల్లూరు, కొల్లిపర మండలాల్లో ఉన్న పసుపుపంట కల్లాలు అకాల వర్షాలకు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు కల్లాలలో పసుపును ఆరబెట్టుకునే క్రమంలో గోరుచుట్టపై రోకటి పోటు మాదిరిగా అకాల వర్షం కురవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. దుగ్గిరాల యార్డులో పసుపు ధర పతనమై రూ.16వేలకు కొనుగోలు చేసిన పసుపు క్వింటాల్ రూ.9వేలకే కొనుగోలు చేస్తున్నారన్నారు. అకాల వర్షంతో కల్లాలలోని పసుపు రంగు మారి కటిక వచ్చే పరిస్థితి ఉందన్నారు. తక్షణం ప్రభుత్వం రైతులను ఆదుకునే విధంగా క్వింటాల్ రూ.15వేలకు కొనుగోలు చేయాలని రైతుసంఘం డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, బుర్రముక్క శివరామిరెడ్డి, రామిరెడ్డి, గణేష్బాబు, మానుపాటి బాబు, సోమేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ వారధిపై తప్పిన భారీ ప్రమాదం

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని కనకదుర్గమ్మ వారధిపై శనివారం తెల్లవారుజామున భారీ ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం.. వారధి 16వ నెంబరు పిల్లర్ వద్ద టాటా ఏస్ వాహనాన్ని టైరు పంక్చర్ కావ డంతో పక్కన ఆపారు. గుంటూరు నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఆగివున్న టాటా ఏస్ వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ఘటనలో టాటా ఏస్ వాహనం బోల్తా కొట్టి నుజ్జునుజ్జు అవ్వగా వంతెన రైలింగ్ కూడా దెబ్బతింది. కొంచెం అదుపు తప్పితే దాదాపు 50 అడుగుల దిగువన నదిలో బస్సు పడితే పెను ప్రమాదం జరిగేది. వారధిపై సుమారు గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. తాడేపల్లి పోలీసులు క్రేన్ సాయంతో దెబ్బతిన్న వాహ నాలను తొలగించి ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు.

పునీత మిఖాయిల్ మందిరంలో నేడు జూబ్లీ వేడుకలు

మంగళగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పునీత మిఖాయిల్ చర్చిలో ప్రతీ 25 ఏళ్లకు నిర్వహించే జూబ్లీ వేడుకలను ఈనెల ఆరో తేదీన నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభువైన ఏసుక్రీస్తు వారి దీవెనలు ప్రతీ ఇంటిమీద, ప్రతీ మనిషికి వుండాలని ఆకాంక్షిస్తూ ఆదివారం ఉదయం ఆరునుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు చర్చిలో ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రార్థనలను నిర్వహిస్తారు. ఈ ప్రత్యేక వేడుకలకు ముఖ్యఅతిధిగా గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య హాజరవుతారని పుణ్యక్షేత్రం విచారణ గురువు నల్లపాటి శౌరిబాబు తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రేపు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్లకు ఆన్‌లైన్ నందు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలను ఈ నెల 7వ తేదీన పరిశీలిస్తామని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న శనివారం తెలిపారు. బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్, కాపు వర్గాల నిరుద్యోగ యువతకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి వ్యక్తిగత సబ్సిడీ రుణాల కొరకు 1616మంది దరఖాస్తు చేసుకున్నార న్నారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉదయం గం.10.00 నుండి 2.00గంటల వరకు ధ్రువపత్రాలు, దరఖాస్తు, బ్యాంకు పాస్‌బుక్, పాస్‌పోర్టు ఫోటోలు, ఒక సెట్టు జిరాక్స్‌తో అభ్యర్థులు హాజరుకావాలని కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుబడిన జగ్జీవన్‌రామ్

● జయంతి వేడుకలలో ఆలపాటి, నక్కా ఆనందబాబు



జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యే ఆనందబాబు తదితరులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మాజీ ఉప ప్రధాని దివంగత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక మార్కెట్ సెంటర్‌లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ అనేక పదవులను నిర్వహించి సమాజంలో కుల వివక్షణను రూపుమాపుతూ అనేక సంస్కరణలను చేపట్టారన్నారు. అయితే అంబేద్కర్, జగ్జీవన్ రామ్‌లను వర్గాలుగా విభజించడం బాధ కల్గిస్తుందన్నారు. నక్కా ఆనందబాబు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘ నాయకులు కేసన శంకరావు, ఐఆర్ఎస్ ఆనందకుమార్, ఏపీపీ సుకుమార్, పెద్దపల్లి మురళీధర్, ఇందుపల్లి రాజారాం, రావి చిన్ని, ఎండి ఖుద్దుస్, కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, దానబోయిన వెంకటేశ్వరావు, మేకల రవికుమార్, కిరణ్ కొలకలూరి, మోహన్, సతీష్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి, వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబులు గెలిపొందిన సందర్భంగా టీడీపీ శ్రేణులు మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం స్థానిక చెంచుపేటలోని ఆర్‌సీఎం చర్చిలో టీడీపీ నాయకుడు మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌కుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులు పలువురు నాయకులతో కలసి నిత్య సహాయమాతకు 101 కొబ్బరికాయల మొక్కుబడి చెల్లించారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిసర ప్రాంతాలలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్నతో కలసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషిచేశారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, అసిస్టెంట్ సిటీప్లానర్ శివన్నారాయణ, ఆర్‌వో రాంప్రసాద్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

తెనాలిరూరల్, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పలువురు వైసీపీ శ్రేణులు కలిసి ఐతానగర్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసపల్ వైస్‌చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, గడ్డేటి సురేంద్ర, యాతాటి అనిల్, కఠెవరం దేవయ్య, కొమ్ము రాయల్, కాకి దేవసహాయం, కొమ్మురాజేష్, మన్నవ ప్రభాకర్, రాజ్‌కుమార్, మల్లేశ్వరరావు, కటారి హరీష్, ధర్మకోటి మల్లేశ్వరరావు, చిన్ని బాలు, శశి, సునీల్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత...

తెనాలి రూరల్, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): కులవివక్షను రూపుమాపేందుకు కృషిచేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులతో కలిసి హరిప్రసాద్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సొపాటి కిరణ్‌కుమార్, కోపల్లె శ్రీనివాస్, అత్తోట శరత్, నలుకుర్తి రమేష్, మల్లవరపు విజయ్‌కుమార్, బడుగు డేవిడ్, పిసపాటి రవీంద్ర, రాజేంద్రప్రసాద్, కంచర్లపాలెం రమేష్, శివకేశవ్, కామేశ్వరి, జయరాం, కుదురవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ కార్మిక ఉద్యమానికి బాబుజగ్జీవన్‌రామ్ కృషిచేశారని ఐఆర్ఎస్ అధికారి పి.ఆనంద్‌కుమార్ చెప్పారు. స్టేషన్ రోడ్డులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేకల రవి, నలుకుర్తి రమేష్, శరత్, సురేష్, ప్రభాకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. లక్ష్మణకుమార్, కొండమూది రమేష్, రత్నం, నాగేశ్వరరావు, ఇందుపల్లి రాజారామ్ పాల్గొన్నారు.

● కొల్లిపర, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వల్లభాపురం, మున్నంగి గ్రామాల్లో దళితవాడల్లో ఏర్పాటుచేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు దళిత నాయకులు నివాళులర్పించారు. కొల్లిపర విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈఈ కె.రాజశేఖర్, ఏఈ ప్రదీప్‌కుమార్, సబ్‌ఇంజనీర్ సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



తెనాలి: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు



అవగాహన సదస్సులో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, డాక్టర్ ఏంజెల్

పిల్లల్లో లోపాలపై అవగాహన కలిగి ఉండాలి

తెనాలిరూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): 0 నుండి 9 ఏళ్ల లోపు పిల్లల్లో ఆటిజం లోపాలను గుర్తించడంపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ ఏంజెల్ చెప్పారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్లో విజయవాడకు చెందిన రాజేంద్ర స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏంజెల్ అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, ఐసీడీఎస్ ప్రాజెక్టు టీచర్లకు ఆటజంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏంజెల్ మాట్లాడుతూ దేశంలో 1 నుండి 1.5శాతం మందిలో ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ సమస్యలతో 0-9 సంవత్సరాల చిన్నారులు బాధపడుతున్నారని చెప్పారు. ఈ సమస్య ఉన్న పిల్లలు చూడటానికి సాధారణ పిల్లలలాగే కనిపిస్తుంటారన్నారు. కానీ వయసుకు తగిన వికాసం లోపించి ఉంటుందన్నారు. పిలిచిన వెంటనే స్పందించకపోవడం, తోటి పిల్లలతో కలిసి ఆటలాడేందుకు ఆసక్తి చూపకపోవడం, వినికిడి లోపంతో బాధపడటం, మాటలు సరిగ్గా పలకలేకపోవడం, వయస్సు పెరుగుతున్నా మాటలు రాకపోవడం, చేసిన పనులే తిరిగి పదే పదే చేస్తూ ఉండటం, అమాయకత్వంతో ఉండటం వంటి పలు లక్షణాలున్న వారిని ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించాలన్నారు. అటువంటి వారిని తక్షణమే వైద్యసేవలు అందిస్తే తిరిగి సాధారణ జీవితాన్ని గడపగలుగుతారని చెప్పారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కొడాలి సౌజన్యశ్రీ, పలువురు ఐసీడీఎస్ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డుతో ఏఎస్ఎన్ కళాశాల ఒప్పందం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డుతో ఏఎస్ఎన్ కళాశాల ఒప్పందం చేసుకుందని విద్యాసంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం మీద శిక్షణ ఇచ్చేందుకు ఇన్ఫోసిస్‌సంస్థ వాహనం శనివారం కళాశాలకు చేరుకుంది. తద్వారా విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలు అందుకుంటారని పేర్కొన్నారు. ఇన్ఫోసిస్ ప్రతినిధులు కార్తీక్, అదిత్యకృష్ణ, ప్రిన్సిపాల్ రాంచంద్ పాల్గొన్నారు.

7న విద్యుత్ కార్మికుల చలో విజయవాడ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 7న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ తెలిపారు. టీడ్కో సబ్‌స్టేషన్ వద్ద ఛలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరించారు. సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్‌మెన్‌లు ధర్నాకు తరలిరావాలని కోరారు. గుంటూరు నాగరాజు, బాజీ, విక్రమ్, శేఖర్ పాల్గొన్నారు.

రోగులకు బాసటగా నేడు రక్తదాన శిబిరం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మంత్రి నాదెండ్ల మనోహర్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. శ్రీచక్ర సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శిబిరం జరుగుతుందని రెయిన్‌బో బ్లడ్ సెంటర్ నిర్వాహకులు ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. డాక్టర్ కమ్మెల హరీష్, డాక్టర్ కమ్మెల మోహన్, కమ్మెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

● పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యుదయానికి పాటుబడిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే, సంగండెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కొనియాడారు. మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శనివారం పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కేక్‌లు పంచిపెట్టారు. అనంతరం పట్టణంలో పాదయాత్రగా వెళ్లి రేపల్లె బస్‌స్టాండ్ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పార్లమెంట్ సభ్యుడిగా వ్యవహరించి పదవులకే వన్నెతెచ్చారన్నారు. దళిత హక్కుల సంరక్షకుడిగా ఆయన విభిన్న రంగాల్లో చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిపాయని కీర్తించారు. అనంతరం జగ్జీవన్‌రామ్ విగ్రహకమిటీ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు చిలకా విజయ్, రవి, రవీంద్రకుమార్, సొపాటి వెంకట్రావు, ఆరమండ మధు, మల్లెల సునీల్ తదితరులు పాల్గొన్నారు. చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చేబ్రోలులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేఆర్ యూత్, ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటుచేసి మంచినీరు పంపిణీ చేశారు. మహిళలకు చీరల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు దిలీప్‌రాజ, టీడీపీ నాయకుడు కూచిపూడి రవిశేఖర్, పులి ప్రభుదాస్, పాలపర్తి బాలాజి, టీడీపీ మండల అధ్యక్షుడు మెలా వెంకటరామరాజు, అనంత లక్ష్మీనారాయణ, జగ్జీవన్‌రామ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

● పెదకాకాని, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పెదకాకానిలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మండల టీడీపీ ఆధ్వర్యంలో వేడుకలను జరిపించారు. పెదకాకాని మెయిన్ సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. తొలుత పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

సమానత్వం కోసం పోరాడిన జగ్జీవన్‌రామ్

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శనేత బాబుజగ్జీవన్‌రామ్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కొనియాడారు. పొన్నూరు పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రేపల్లె బస్టాండ్ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి రామకృష్ణ, తదితర నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుడు జగ్జీవన్‌రామ్ అన్నారు. అనగారిన వర్గాల సమానత్వం కోసం పోరాటాలు సాగించి దళితుల హక్కుల సంరక్షణ కోసం పాటుబడ్డారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వి.రాధాకృష్ణమూర్తి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాంబాబు, ఉప్పాల సత్యానారాయణ, ఏ అరుణ్‌కుమార్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యాదర్శి ఆరేటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

14 వరకూ ఆత్మగౌరవ పోరాట దినాలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజు ఈ నెల 14 వరకూ దళిత పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా నిర్వహిస్తున్నట్లు కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ తెలిపారు. శనివారం పౌరహక్కుల వేదిక కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ సమసమాజ స్థాపక కోసం పోరాడిన జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ త్యాగాలను స్మరిస్తూ ఆత్మగౌరవ పోరాట దినాలు పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ తూమాటి రాజారావు, ప్రజాసంఘాల నాయకులు కోడేటి శ్రీనివాస్, మన్నెం కిషోర్, ఘంటా రాజేంద్ర, కొప్పుల విజయ్‌కుమార్, బేతాళ్ల ప్రకాష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

అర్చక విభాగం రాష్ట్ర కార్యదర్శిగా చిలకపాటి



లక్ష్మణ రామాచార్యులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అర్చక విభాగం రాష్ట్ర కార్యదర్శిగా చిలకపాటి లక్ష్మణ రామాచార్యులు శనివారం నియమితులయ్యారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ నియామకపత్రాలను అయనకు అందజేశారు. పట్టణంలోని కోదండ రామస్వామి ఆలయ ప్రధాన అర్చకుడిగా పని చేస్తున్న రామాచార్యులు నియామకం పట్ల పట్టణ బ్రాహ్మణ సేవాసంఘం నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

యాచకుడి మృతి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో యాచకుడి మృతిపై శనివారం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని వీవర్స్ కాలనీలో పాత బస్‌షెల్టర్‌లో గత కొద్దిరోజులుగా గుర్తు తెలియని వ్యక్తి (50) భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఆ వ్యక్తి మృతిచెంది ఉంటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని అర్బన్ పోలీసులు నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి శవపరీక్షల నిమిత్తం తరలించారు.

రంగనాయకమ్మ నిలయంలో రామాయణ పారాయణం

తెనాలి రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక అడుసుమల్లివారి వీధిలోని శ్రీరంగనాయకమ్మ నిలయంలో శరణాగతి గోష్ఠి పీఠం ట్రస్ట్ నరేంద్ర రామానుజదాస స్వామీజీ ఆధ్వర్యంలో వసంత నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా స్వామివార్లకు అభిషేక కార్యక్రమాలు నిర్వహించి రామాయణ పారాయణం నిర్వహించారు. విష్ణుమొలకల వాలేశ్వరరావు, శ్యామసుందరరావు, తన్నీరు సీతారామయ్య, శివనాగమల్లేశ్వరరావు, కిషోర్, సమరసత సేవా జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు పాల్గొన్నారు.